ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 28.10.2026 | సంపుటి:13 సంచిక : 98 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఇంత జరుగుతున్నా స్పందించరెందుకు?

ఔషధ ధరలపై నియంత్రణపై కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు



2లో

## అభి'షేక్' చేశాడు..



### మెరుపు శతకంతో న్యూజిలాండ్‌తో మూడో టీ20లో భారత్ ఘన విజయం

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో భారత్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు సెంచరీతో విరుచుకుపడ్డాడు. వైభవ్ సూర్యవంశీ కూడా చెలరేగాడు.వీరిద్దరూ చెలరేగడంతో ఈ లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. నాలుగో టీ20 శుక్రవారం జరగనుంది.

## ప్లేజ్.. వాయిదా వేసుకోండి

నవంబర్ 1న మెగా ర్యాలీపై రాహుల్‌కు సీటీబీ మరో లేఖ



9లో



# దేశవ్యాప్తంగా నకిలీ ఆధార్‌తో నేపాలీ ముఠాలు..

నేపాలీల ఆగడాలు పార్ట్-2

### పనివారిగా ఇళ్లలోకి ప్రవేశం.. ఆపై చోరీలు.. హత్యలు

### హైదరాబాద్ నుంచి ఢిల్లీ, గురుగ్రామ్, బెంగుళూరు వరకు నేరాల జాడ..



ఒక దేశంలో ఒక పేరు.. మరో దేశంలో ఇంకో పేరు! నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు గుర్తింపు పత్రాలతో భారతీయులుగా చలామణి అవుతూ ఇళ్లలో పనివారిగా చేరి చోరీలు, దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న నేర ముఠాల వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు ఈ తరహా నేరాల వ్యవహారాన్ని మరోసారి వెలుగులోకి తెచ్చింది. దేశంలోని పలు నగరాల్లోనూ ఇలాంటి నేరాలకు పాల్పడిన ముఠాలపై పోలీసులు గతంలో కేసులు నమోదు చేశారు.



హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు: ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్ అనంతరం వారి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

- గుర్తింపు పత్రాల ముసుగులో నేరాలు
- మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో వెలుగులోకి కీలక అంశాలు
- అప్రమత్తంగా ఉండాలన్న హైదరాబాద్ సీపీ సజ్జనార్

హైదరాబాద్, అక్టోబరు 27 (జనంసాక్షి): జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య తనుజా రంజన్ మే 7-8 తేదీల మధ్య రాత్రి హత్యకు గురయ్యారు. ఇంట్లో పనివారిగా చేరిన మహిళతో సంబంధం ఉన్న ముఠా ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. బాధితురాలి చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇంటి నుంచి సుమారు 225 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఈ కేసులో నేపాల్‌కు చెందిన నలుగురు నిందితులను అక్టోబరు 26న నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. గతంలో మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు పలు రాష్ట్రాల్లో గాలింపు

మిగతా 2లో..

## కరవు మండలాలు 365

### రాష్ట్రంలో 31 జిల్లాల్లో గుర్తించిన ప్రభుత్వం

### ఈ ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో 31 జిల్లాల్లో 365 కరవు ప్రభావిత మండలాలుగా గుర్తించింది. ఇందులో 111 మండలాల్లో తీవ్రమైన, 254 మోస్తరు ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కరవు మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లను సర్కార్ ఆదేశించింది.





## నా స్టోరీ నేనే చెబుతా..

- ఇన్నాళ్లు వాళ్లు చెప్పారు కదా:సోనియా
- తన ఆత్మకథకు సంబంధించి సోషల్ మీడియాలో మరో వీడియో పోస్టు చేసిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తన భర్త రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని పూర్తిగా వ్యతిరేకించానని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తెలిపారు. తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు సంబంధించి సోషల్ మీడియాలో మరో వీడియో పోస్టు చేశారు. దశాబ్దాలుగా తన గురించి ఇతరులు అనేక విషయాలు చెప్పేవారని, ఇప్పుడు తన వంతు వచ్చిందన్నారు. ఈ పుస్తకం విడుదలైన తర్వాత కొన్ని నాటకీయ పరిణామాలు జరగడం ఖాయమన్నారు. "నా గురించి అనేక వార్తలు వచ్చాయి. కానీ, వాటిలో చాలా వరకు అవాస్తవాలు, కల్పితాలే. మరికొన్ని అతిశయోక్తిగా అనిపించాయి. అందుకే స్వయంగా వాస్తవాలను చెప్పాలనుకున్నా. ఇది నా కథ. ప్రజలకు నా గురించి అనేక అభిప్రాయాలున్నాయి. దీని

మిగతా 2లో..

## ప్రజలు కేసీఆర్‌ను సీఎం చేయాలని నిర్ణయించుకున్నారు

- ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులతో కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది. సెకండాఫ్ కూడా చాలా అయింది.. ఇంకా ఎక్కువ టైం కూడా లేదు.. ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది.. ఆ తర్వాత కేసీఆర్ వస్తరు.. మనందరికీ మంచి రోజులొస్తయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ =ధీమా వ్యక్తం చేశారు. మీ నిర్మల్ తాలూకాలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నరు, బీజేపీ ఎంపీ ఉన్నరు.. నిర్మల్‌కు బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.. తప్పు వాళ్లు చేసిందేమీ కాదు.. మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా, గోడం నగేశ్ ఎంపీగా గెలిచారు.. ఏమొచ్చింది నిర్మల్‌కు.. అదే కేసీఆర్ ఉన్నప్పుడు నిర్మల్‌కు ఏమొచ్చిందని అడగొచ్చు.. నిర్మల్‌ను జిల్లా చేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్‌లో

మిగతా 2లో..

## ప్రతీ భూ యజమానికి 'ఆధార్' తరహాలో ప్రత్యేకంగా భూదార్

### ఉపగ్రహ చిత్రాలతో భూ పటాలు.. పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తాం

- తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే
- రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు 15 రోజుల్లో పూర్తి చేయాలి
- ఎల్‌నినో ప్రభావంతో రెండో పంట సాగుకు వెళ్లవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం
- రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించాలి
- భూ సర్వేలో పారదర్శకత పాటించాలి
- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించం : మంత్రి పొంగులేటి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి): రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తామని వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తామని చెప్పారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భూ సర్వే, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, రాబోయే రోజుల్లో తలెత్తే నీటి ఎద్దడి తదితర అంశాలపై వివరించారు. ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే.. భూభారతి చట్టం అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వేకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో ధరణి విధానంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ భూ పరిపాలనలో పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో

మిగతా 2లో..







## ఆంధ్రాలో తీరం వైపుగా అర్నబ్..

### భోగాపురం, విజయవాడ నుంచి పలు విమాన సర్వీసుల రద్దు

### తుపాను నుంచి ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం: చంద్రబాబు

అమరావతి(జనంసాక్షి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'అర్నబ్' గంటకు 20 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన 6 గంటల్లో గంటకు 18 కి.మీ వేగంతో కదిలిన అతి తీవ్ర తుపాను.. ప్రస్తుతానికి విశాఖపట్నానికి 170 కిలోమీటర్లు, కాకినాడకు 140, మచిలీపట్నంకు 230,

మిగతా 2లో..

## తెలంగాణలో భారీ వర్షాలు

- తెలంగాణపై అర్నబ్ తుపాను ప్రభావం
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌లలో భారీ వర్షాలు



2లో..

## మైక్రోసాఫ్ట్‌లో 60వేల మంది స్వచ్ఛందంగా తొలగింపునకు శ్రీకారం

### వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్‌ను ప్రకటించిన సంస్థ

వాషింగ్టన్(జనంసాక్షి):టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తగ్గించుకోవడానికి వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్‌ను ప్రకటించింది. భారత్ సహా పలు దేశాల్లో 60వేల మంది ఈ ప్లాన్‌కు అర్హులు. అంటే ఇంతమంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉండటం టెక్ రంగంలో సంచలనంగా మారింది దీని ప్రభావం ప్రపంచంలోనే రెండో అతిపెద్దదైన హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌పై పడే అవకాశం ఉంది. మైక్రోసాఫ్ట్ ఇంటర్నల్ గ్రేడింగ్ సిస్టమ్ ప్రకారం లెవల్ 70 అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులు దీనికి అర్హులు ఎగ్జిట్ ఆఫర్‌లో వయోపరిమితి, కనీస సర్వీస్ కాలం నిబంధనలు ఏవీ లేవు. అలాగే ఉద్యోగి ప్రతిభతో సంబంధం

మిగతా 2లో..




## దాడులు ఆపండి.. ఒక బిలియన్ డాలర్ తీసుకోండి..

### హూతీలకు సౌదీ ఆఫర్



అబుదాబీ(జనంసాక్షి):సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులతో పశ్చిమాసియాలో ఘర్షణలు మరో స్థాయికి వెళ్లాయి. సౌదీలోని మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలను డ్రోన్లు, క్షిపణులతో టార్గెట్ చేస్తుండడంతో సంపన్న దేశం తీవ్ర ఆర్థిక, ప్రాణ నష్టాలను చవిచూస్తోంది. హర్మూజ్‌లో ట్యాంకర్లపై ఇరాన్ చేస్తున్న దాడుల వల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులకు కూడా అంతరాయం కలుగుతోంది. దేశంలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్

మిగతా 2లో..

## తమిళనాడు జైలు నుంచి 17 మంది ఖైదీలు పరార్

2లో..

## మైక్రోసాఫ్ట్‌లో 60 మంది స్వచ్ఛందంగా తొలగింపునకు శ్రీకారం

కూడా లేదు. అయితే అన్ని విభాగాలకు ఈ ప్లాన్ వర్తించదు. సేల్స్, మార్కెటింగ్, సెక్యూరిటీ, కొన్ని నిర్దిష్ట ఇంజినీరింగ్ విభాగాలు ఇందులో భాగం కావు. కోపైలట్, కోర్ఏఐ, విండోస్+డివైజ్, ఎక్స్‌బాక్స్, ఫైనాన్స్, హెచ్ఆర్ వంటి విభాగాల్లోని ఉద్యోగులు ఈ ఆఫర్‌ను ఎంచుకొని సంస్థ నుంచి వెళ్లిపోవచ్చు.

భారత్‌లో కూడా..

భారత్‌లో మైక్రోసాఫ్ట్‌కు 23,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఎక్కువమంది టెక్నాలజీ, ఇంజినీరింగ్, కార్పొరేట్ సపోర్ట్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఎంతమందికి ఈ ప్లాన్ వర్తిస్తుందో స్పష్టంగా తెలియాల్సి ఉంది. కోపైలట్, ఏఐ, క్లౌడ్ వంటి విభాగాల సిబ్బంది ఇక్కడ కూడా ఉన్నారు. మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం ఉన్న రెడ్‌మండ్ క్యాంపస్ తర్వాత హైదరాబాద్ క్యాంపసే అతిపెద్ద ఇంజినీరింగ్ హబ్. ఇక్కడ దాదాపు 10,000 మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. భారత్‌లో బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, న్యూదిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కతా, పుణె, ముంబయి, నోయిడాలో కార్యాలయాలున్నాయి. తాజా ఆఫర్‌ను అంగీకరించి వెళ్లే ఉద్యోగులకు కంపెనీ స్టాండర్డ్ సెవరెన్స్ రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఉద్యోగులు మరో ఉపాధిని ప్లాన్ చేసుకోవడానికి, కొత్త ఉద్యోగం కోసం వెతుక్కునే క్రమంలో అవసరమైన వనరులను సమకూర్చుతామని ఈ ప్లాన్‌లో భాగంగా మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.

లేఆఫ్‌లకు బదులుగా ఈ ఆఫర్ ఎందుకంటే..?

కంపెనీ నేరుగా ఉద్యోగులను తీసేయడానికి బదులుగా భవిష్యత్‌లో కొత్త కెరీర్ మార్గాలను వెతుక్కోవాలనుకునేవారికి గౌరవప్రదమైన నిష్క్రమణ మార్గాన్ని కల్పించాలని ఈ ప్లాన్‌ను ప్రతిపాదించినట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ ఆమీ కొలెమాన్ వివరించారు. అంటే నిర్బంధ తొలగింపులకు దీనిని ప్రత్యామ్నాయంగా చూస్తోంది. ఏఐపై భారీ పెట్టుబడులు, కంపెనీ ప్రాధాన్యతలకు తగ్గట్టుగా ఉద్యోగుల పునర్వ్యవస్థీకరణ లక్ష్యంగా ఈ తరహా తొలగింపులకు ప్లాన్ చేసింది. అంతర్గతంగా ఇప్పటికే కోపైలట్ వంటి ఏఐ టూల్స్ వినియోగం పెరగడం వల్ల ఉత్పాదకత పెరిగింది. దీనివల్ల తక్కువ మంది ఉద్యోగులతోనే ఎక్కువ పని పూర్తి చేసే అవకాశం లభించింది. దానిలో భాగంగానే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటోంది.

### దాడులు ఆపండి.. ఒక బిలియన్ డాలర్ తీసుకోండి..

సల్మాన్ ఎట్టకేలకు హూతీలతో రాజీకొచ్చారు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ మధ్యవర్తిత్వంతో తిరుగుబాటుదారులకు ఓ ఆఫర్ ఇచ్చారు. హూతీలు తమ దేశంపై దాడులను పూర్తిగా ఆపితే 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9,500 కోట్లు) ఇస్తామని సౌదీ యువరాజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొత్తాన్ని ఇరాన్ ద్వారానే హూతీలకు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందం కోసమే ఇటీవల సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ టెహ్రాన్‌కు వెళ్లారు. ఆయన వచ్చిన సైనిక రవాణా విమానంలోనే.. హూతీలకు ఇవ్వదలిచిన మొత్తం డబ్బును తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని సౌదీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చల్లో తుర్కియే ఇంటెలిజెన్స్ చీఫ్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు సమాచారం. గతంలో హూతీలు యెమెన్ ప్రభుత్వంతో పోరాడుతున్న తరుణంలో వీరికి వ్యతిరేకంగా సౌదీ అరేబియా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. ఇక అప్పటి నుంచి వీరి మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతోంది. ఈ క్రమంలోనే సౌదీ వారితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందుకు వచ్చింది.

# దేశవ్యాప్తంగా నకిలీ ఆధార్‌తో నేపాలీ ముఠాలు..



చేపట్టడంతో పాటు భారత్ నేపాల్ సరిహద్దు ప్రాంతంలోనూ ఐదు నెలలపాటు నిఘా కొనసాగించాయి.

**ఢిల్లీ నుంచి బెంగళూరు వరకు..**

నేపాల్‌కు చెందిన నేర ముఠాలు నకిలీ గుర్తింపు పత్రాల సాయంతో దేశంలోని వివిధ నగరాల్లో ఇళ్లలో పనివారిగా చేరి చోరీలకు పాల్పడినట్లు ఢిల్లీ, గురుగ్రామ్ పోలీసులు గతంలో వెల్లడించారు. ఒక ముఠా ఢిల్లీ, గురుగ్రామ్, సూరత్, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నేరాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ఈ ముఠా సభ్యులకు నకిలీ ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను సమకూర్చి, గృహ సహాయకులుగా ఉద్యోగాలు పొందేందుకు సహకరించినట్లు పోలీసులు ఆరోపించారు. మొదట యజమానుల నమ్మకాన్ని సంపాదించి, ఇంట్లోని నగలు, నగదు, భద్రతా ఏర్పాట్లు, కుటుంబ సభ్యుల రాకపోకల గురించి సమాచారం సేకరించి, అనుకూల సమయంలో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తు వివరాలు వెల్లడించాయి.

**నకిలీ ఆధార్ తయారీలోనూ ముఠాలు**

విదేశీ పౌరులకు తప్పుడు భారతీయ గుర్తింపు పత్రాలు సమకూర్చే ముఠాలపై వివిధ రాష్ట్రాల పోలీసులు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం నకిలీ పత్రాలతో ఆధార్ సహా ఇతర గుర్తింపు పత్రాలు పొందేందుకు సహకరించిన ముఠాను పట్టుకుంది. ఈ కేసులో నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు చెందిన వ్యక్తులకు తప్పుడు పత్రాలు సమకూర్చినట్లు ఆరోపణలు వచ్చాయి. బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాలో అక్టోబరు 2026లో నకిలీ ఆధార్ కార్డుల తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద 12 నకిలీ ఆధార్ కార్డులు, ఖాళీ కార్డుల తయారీ సామగ్రి, ముద్రణ యంత్రం, వేలిముద్రలు, కంటిపాపల గుర్తింపును సేకరించే పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా నేపాల్ పౌరులకు నకిలీ కార్డులు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

**గుర్తింపును నిర్ధారించుకోవాలి**

ఇళ్లలో పనివారిని, వంటవారిని, కాపలాదారులను, సంరక్షకులను నియమించుకునే ముందు వారి గుర్తింపు, నివాసం, గత ఉద్యోగ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ప్రజలకు సూచించారు. నేపాల్ పౌరుల విషయంలో వారి జాతీయ గుర్తింపు పత్రాలను సంబంధిత అధికారిక పౌర సమాచార వ్యవస్థ ద్వారా ధ్రువీకరించాలని తెలిపారు. గతంలో పనిచేసిన యజమానులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని, అపార్ట్‌మెంట్లు, సముదాయాల్లో సందర్శకుల నమోదు, గుర్తింపు పత్రాల పరిశీలన, నిఘా కెమెరాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు.

**వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలి**

నకిలీ గుర్తింపు పత్రాలను తయారు చేస్తున్నవారిని, వాటిని సమకూరుస్తున్న మధ్యవర్తులను, అక్రమాలకు సహకరిస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆధార్ జారీ ప్రక్రియలో తప్పుడు పత్రాలు ఎలా చొరబడుతు న్నాయి? ఒకే వ్యక్తి వేర్వేరు పేర్లతో పత్రాలు పొంద కుండా నిరోధించేందుకు ఎలాంటి తనిఖీలు అవస రం? అనే అంశాలపై అధికారులు దృష్టి సారిం చాలి.అయితే, నేపాల్ పౌరులందరినీ నేరస్థులుగా చూడటం సరికాదు. నేరాలకు పాల్పడిన వ్యక్తులపై ఆధారాలతో చర్యలు తీసుకోవడమే సరైన విధానం. ఆధార్ కార్డు భారతీయ పౌరసత్వానికి రుజువు కాదు. తప్పుడు వివరాలతో పత్రాలు పొందడం, వాటిని నేరాలకు ఉపయోగించడం నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు. హైదరాబాద్‌లో వెలుగుచూసిన హత్య కేసు నేపథ్యంలో దేశవ్యాప్తంగా నకిలీ గుర్తింపు పత్రాల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు, రాష్ట్రాల మధ్య సమాచార సమన్వయం, ప్రజల్లో అవగాహన పెంపు అవసరం.

## ప్రతీ భూ యజమానికి ఆధార్ తరహాలో పత్యేకంగా 'భూదార్'

70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డుల విషయంలో స్పష్టత తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.భూ సమస్యలను పరిష్కరించి, పేదలు, రైతులు సహా అన్ని వర్గాల భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. అర్హులకు న్యాయం జరిగేలా పారదర్శక విధానాలను అమలు చేస్తామని తెలిపారు.15 రోజుల్లో ఇళ్ల కేటాయింపు పూర్తి గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్లను అర్హులకు కేటాయించే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తామని చెప్పారు. మిగిలిన ఇళ్ల కేటాయింపును కూడా 15 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రతరం అయ్యే అవకాశాలున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి సమస్యలు ఎదురవుతున్నాయని, భవిష్యత్తులో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి లభ్యతకు ఇబ్బందులు తలెత్తవచ్చని పేర్కొన్నారు.రెండో పంట సాగుకు నీరు, విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసినా నీటి లభ్యతే ప్రధాన సమస్యగా మారే పరిస్థితులున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిస్థితులను అర్థం చేసుకొని రెండో పంట సాగుకు వెళ్లకుండా ప్రభుత్వానికి సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.నీటి కొరతపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై చర్చించేందుకు బుధవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్రం సహకరిస్తుందనే నమ్మకం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించాలి**

రెవెన్యూ శాఖలో పనితీరు మారాలని లేదంటే ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను హెచ్చరించారు. ఇప్పటికే పలుమార్లు ఆదేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా బాధ్యతాయుతంగా పనిచేయకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సర్వే పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతులకు భూమి విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి.రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని మంత్రి తెలిపారు. సర్వే కోసం కేటాయించిన గ్రామాలు, పూర్తయిన సర్వేలు, రోజువారీ పురోగతి, పనులు పూర్తిచేయడానికి పట్టే సమయంపై తహసీల్దార్లు, సర్వేయర్లను ప్రశ్నించారు. సర్వే సమయంలో ప్రతి రైతుకు తన భూమి విస్తీర్ణం, సరిహద్దులపై స్పష్టమైన సమాచారం అందించాలని ఆదేశించారు. రైతులకు సందేహాలు మిగలకుండా క్షేత్రస్థాయిలోనే వివరించాలని సూచించారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అధికారులు సర్వే పనులను నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామాల్లో పర్యటించి పురోగతిని స్వయంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటూ భూ సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని తెలిపారు.పేదలకు సొంతింటి కల సాకారం.రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారం తగ్గించేందుకు సిమెంట్ బ స్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

### ఇంత జరుగుతున్నా స్పందించరెందుకు?

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఔషధాల ఎంఆర్‌పీకి, రిటైలర్లకు విక్రయించే ధరకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసంపై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "మొత్తం వ్యవస్థ ఫార్మాస్యూటికల్ తయారీదారులకు సాయపడేలా ఎందుకు పనిచేస్తోంది?" అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం నిలదీసింది. అయితే.. ఫార్మా రంగానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను నియంత్రించకూడదనేది ప్రభుత్వ విధానమని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం తెలిపింది. దేశంలో ఔషధాల ధరలపై దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. 'నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ' పూర్తిగా నిరుపయోగమైన సంస్థగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఎంఆర్‌పీకి, రిటైలర్ ధరకు మధ్య ఉన్న భారీ తేడాను ప్రస్తావిస్తూ.. "ప్రభుత్వమే దీనికి అనుమతిస్తోంది. దాని కళ్లముందే ఇదంతా జరుగుతోంది. దీన్ని ఇలాగే అదుపు లేకుండా సాగిపోనివ్వాలా?" అని ప్రశ్నించింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపిస్తూ.. భారత్‌లో మందుల ధరలు ప్రపంచంలోనే అత్యంత తక్కువగా ఉన్నాయని కోర్టుకు తెలిపారు. అనంతరం ధర్మాసనం ఈ వ్యవహారంపై తీర్పును రిజర్వ్ చేసింది.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client Sri. **Akula VenuNath** S/o. Sri. **Akula Ashok Kumar,** Aged about: **43 Years,** Occupation: Business, R/o. **H.No. 8-3-168/B/13, Plot No. 13, First Floor, Siddhartha Nagar, North Ameerpet, Sanjeev Reddy Nagar, Hyderabad-500 038,** Telangana had entered into a Registered Agreement of sale cum General Power of Attorney with Possession bearing **document no.311 84/2025 with Sri J.Naresh @ Jaya Naresh S/o. Jaya Balaiah, R/o House no. 4-25/4,Patelguda(V),G.P.Kistareddypet, Ameenpur Mandal, Sangareddy District**, in respect of all that the Residential House bearing No.4-25/4, PTIN No. 1244700006, admeasuring 225 Sq. Yds or 188.1 Sq. Mtrs., with a Plinth area of 1556. 25 Sq.ft., with R.C.C, PATELGUDA Village, Ameenpur Mandal & Muncipal, Sangareddy District. Telangana State and further my client is proceeding with the execution of Registered Sale Deed in respect of the said property basing on the said Registered AGPA bearing document no.3118 4/2025. If anyone has any objection to the above said transaction, he/they place objections with necessary documents to the undersigned within ONE week from the date of this public notice, failing which my client will proceed with the registration of the said property.

**VINOD SINGH**
B.Com.,LL.B., Advocate
Office at: Flat No. 001, 3-4-841,
Castle Homes, Barkatpura,
Hyderabad 500027.
Cell.No. 9291300606

## ఆంధ్రాలో తీరం వైపుగా 'అర్నబ్'..

బాపట్లకు 300 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. రేపు ఉదయానికి బాపట్ల- విశాఖ మధ్య యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశముందని అంచనా వేస్తున్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో 125-135 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ప్రజలు బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాసేపట్లో పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు.అర్నబ్ అతి తీవ్ర తుపాను నేపథ్యంలో భోగాపురం విమానాశ్రయం నుంచి పలు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భోగాపురం నుంచి దిల్లీ, హైదరాబాద్, కర్నూలు తిరుపతి, బెంగళూరు, కోల్‌కతా, చెన్నైకి వెళ్లాల్సిన 16 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వాతావరణ మార్పుల కారణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 6 విమాన సర్వీసులను మంగళవారం రద్దు చేశారు. బుధవారం కూడా ఇండిగో సంస్థకు చెందిన అన్ని విమాన సర్వీసులను, ఎయిర్ ఇండియా దిల్లీ విమాన సర్వీసు, ఫ్లై91 సంస్థకు చెందిన రెండు హైదరాబాద్ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం: చంద్రబాబు

అమరావతి: అర్నబ్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు భారీ స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను సముద్రం నుంచి వెనక్కి రప్పించామని, గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేయడంతోపాటు, 5వేల మంది గర్భిణులను సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించినట్లు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని సిద్ధం చేశామని, తుపాను ప్రభావంతో 15 వేల వరకు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువే..

నాగావళి, వంశధార నదులకు వరద వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నామని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను అంచనా వేస్తూ చెరువులకు గండ్లు పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామని తెలిపారు. సుమారు 7.16 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని, నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు నౌకాదళం, కోస్టుగార్డులను అప్రమత్తం చేశామని, హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువగా ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల

అర్నబ్ తుపాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

## ప్రజలు కేసీఆర్‌ను సీఎం చేయాలని నిర్ణయించుకున్నారు

మెడికల్ కాలేజీ పెట్టిందెవరు.. నర్సింగ్ కాలేజీ పెట్టిందెవరు.. నిర్మల్‌లో అభివృద్ధికి బాటలు వేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్ పట్టణంలోకానీ, తాలూకాలో కానీ నేను స్వయంగా వచ్చి మీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించిన. నేనొచ్చి మిషన్ భగీరథ ద్వారా మీ ఇంటింటికి తాగునీళ్లిచ్చే కార్యక్రమం మొదలుపెట్టిన. బ్రహ్మాండంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం.. అయిల్ ఫామ్‌లు పెట్టుకున్నమన్నారు.నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడి పారిపోయాడు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు.ఎప్పుడైనా ప్రతీ పార్టీలో రెండు రకాల వ్యక్తులుంటారు.. ఒకటి అవకాశవాదులుంటారు.. రెండోది పోరాటవాదులుంటారు.. ఆయన అవకాశవాదంతో బయటకు పోయినా మేమున్నం అన్నా భయపడకండని పోరాడుతున్న మీ అందరికీ తలవంచి నమస్కారం చేస్తున్నా.. మంచి రోజులు ముందున్నయి. ఇంకో సంవత్సరమే వీళ్ల కథ.. మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది. సెకండాఫ్ కూడా చాలా అయింది.. ఇంకా ఎక్కువ టైం కూడా లేదు.. ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది.. ఆ తర్వాత కేసీఆర్ వస్తరు.. మనందరికీ మంచి రోజులొస్తయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

**ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే : కేటీఆర్**

తెలంగాణలో వచ్చింది ప్రకృతి కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కరువు పరిస్థితులకు రేవంత్ రెడ్డిదే బాధ్యత అన్నారు.గోదావరి, కృష్ణా నదుల్లో నీళ్లు పారుతున్నా.. తెలంగాణ పొలాలు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే.. అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోయకుండా వృథాగా సముద్రంలోకి వదిలేశారని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లు ఆన్ చేసి ఉంటే రైతులకు సాగునీరు అందేది. రేవంత్ రెడ్డి ఆ పని చేయలేదన్నారు. కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయకపోవడం వల్లే గోదావరి జలాలను వినియోగించుకోలేకపోయాం.రైతుల పంటలు కాపాడటం కంటే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయమే రేవంత్ రెడ్డికి ఎక్కువైందన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ఒప్పుకోవాల్సి వస్తుందనే రాజకీయ కక్షతోనే రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు.. కృష్ణా నుంచి 250 టీఎంసీలు! రాష్ట్రానికి ఉపయోగపడాల్సిన వెయ్యి టీఎంసీల నీటిని వినియోగించుకోలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిది. వెయ్యి టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకుంటే తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

ఆంధ్రాలో పొలాల్లోకి.. తెలంగాణలో సముద్రంలోకి

వాతావరణ హెచ్చరికలు ముందే ఉన్నా.. నీటి నిల్వలు పెంచుకునే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుబంధు లేదు, సకాలంలో కరెంటు లేదు, యూరియా లేదు, సాగునీరు లేదు రైతులను ఇన్ని కష్టాల్లోకి నెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటున్నా.. గొర్రెలు, మేకలు అమ్ముకుంటున్నా ప్రభుత్వానికి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని మళ్లించుకుని ఉపయోగించుకుంటుంటే తెలంగాణలో మాత్రం నదుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు పక్కనపెట్టి.. రైతులకు నీళ్లు ఇవ్వడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రాధాన్యత కావాలన్నారు. తెలంగాణ రైతుల పంటలను కాపాడాలంటే వెంటనే సాగునీటి ప్రాజెక్టుల పంపులు నడపాలని సూచించారు. కరువును ముందే అంచనా వేసి నీటిని నిల్వ చేసుకోవాల్సింది పోయి.. ఇప్పుడు రైతులను ఇబ్బందుల్లోకి నెట్టడం కాంగ్రెస్ పాలనా వైఫల్యం అన్నారు. తెలంగాణ రైతాంగాన్ని కరువు కోరల్లోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగు సమాధానం చెబుతారన్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు

హైదరాబాద్(జనంసాక్షి):బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను తెలంగాణలో మంగళవారం నుంచి ప్రభావం చూపే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది.

సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించిన వాతావరణ శాఖ, గురువారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 28వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్-యానాం ప్రాంతాల్లో తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. అనంతరం ఉత్తర దిశగా ఈ తుపాను ప్రయాణిస్తుందని నిపుణులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

తుపాను దిశ మారే అవకాశం

ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ తుపాను యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉండగా దట్టమైన మేఘాల వల్ల దిశ మారే అవకాశం కూడా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఒక వేళా దిశ మారితే నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇది అత్యంత తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని మరి కొన్ని వాతావరణ నమూనాలు వెల్లడించాయి. అర్నబ్ తుపాను తీరం దాటనుండడంతో భారీ గాలుల ముప్పుతో పాటు తీర ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్లకుపైగా కుండపోత వర్షం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఎల్‌నినో విలయతాండవంతో అన్ని రిజర్వాయర్లలో నీటి మట్టాలు డెడ్? స్టోరేజీకి చేరుతున్నాయి. ఈ సమయానికి 400కు పైగా టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో కేవలం 200 టీఎంసీలే ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ప్రకటించారు. ఈ తుపానుతో ప్రయోజనం ఉంటుందా? అని రైతాంగం ఎదురుచూస్తోంది.

## 'ఎన్నికలు వాయిదా వేయాలన్న వైకాపా ట్రాప్‌లో పడబోం

### స్థానిక ఎన్నికల వ్యవహారంలో వైకాపాకు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ (జనంసాక్షి):స్థానిక ఎన్నికల వ్యవహారంలో వైకాపాకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల గడువు పెంచాలన్న ఆ పార్టీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'ఎన్నికలు వాయిదా వేయాలన్న మీ ట్రాప్‌లో పడబోం' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాలన్నీ పాటించామని రాష్ట్ర ఎన్నికల సంఘం.. న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. నామినేషన్ల సమయం ముగిసినందుకున ఇక ఎన్నికల్లో పోటీ చేయండి అంటూ.. వైకాపా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది.

## ఇప్పటివరకైతే ఇథనాల్ బ్లెండింగ్‌ను పెంచేదిలేదు

### పెట్రోల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి కీలక వ్యాఖ్యలు

పణజీ(జనంసాక్షి): ఇథనాల్ బ్లెండింగ్ పెట్రోల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి కీలక వ్యాఖ్యలు చేశారు. పెట్రోల్‌లో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న ఇథనాల్ బ్లెండింగ్‌ను ఇప్పటికిప్పుడు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. ఈ మేరకు గోవాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ20 లక్ష్యంగా కల్పిత కథనాలు చక్కర్లు కొడుతున్నాయని మంత్రి ఆరోపించారు.చమురు దిగుమతుల బిల్లును తగ్గించుకునే ఉద్దేశంతో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌ను కేంద్రం ప్రోత్సహిస్తోందని మంత్రి చెప్పారు. కరెంట్ ఖాతా లోటును పూడ్చుకోవడంలో ఇదో వ్యూహమని పేర్కొన్నారు. కానీ, ఈ20 లక్ష్యంగా దుష్ప్రచారం జరుగుతోందన్నారు. 2003కు ముందున్న వాహనాల్లో ఈ20 పెట్రోల్ వినియోగం వల్ల కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. కానీ, ఈ20 వల్ల వాహనాలు మొరాయిస్తున్నాయని, ప్రభుత్వం కూడా బ్లెండింగ్ ఫ్యూయల్ విక్రయాలు నిలిపివేసిందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని చెప్పారు. ఆ పోస్టులను తానూ చూశానని అన్నారు.



# రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ రఫీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లింగ్ రంగానికి అందించిన సేవలు, నాయకత్వానికి గుర్తింపుగా సయ్యద్ రఫీని రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు అక్టోబర్ 26న అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు గౌరవ నియామక పత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పూట్కూరి వీరేశం ఈ నియామకాన్ని ప్రకటించారు. తెలంగాణలో రైస్ మిల్లింగ్ రంగ అభివృద్ధికి సయ్యద్ రఫీ అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ గౌరవ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందడంతో పాటు, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాఖ పరిధిలోని పలు కార్యక్రమాల పురోగతిని ఆయన పరిశీలించారు. మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకంలో అర్హులైన మెరిట్ విద్యార్థులకు ఎలాంటి పెండింగ్ లేకుండా పారదర్శకంగా నిధులు అందించాలని మంత్రి సూచించారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకానికి సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేసేలా టెండర్లతో పాటు ఇతర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధుల మంజూరుపై ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు. మిగిలిన గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు నెలకు కనీసం ఒక గురుకులాన్ని సందర్శించి నివేదిక ఇవ్వాలని సూచించారు. నవంబర్ మొదటి వారంలో ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి, నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలని మంత్రి ఆదేశించారు.

ఐదుగురు సభ్యుల కమిటీ నివేదిక ఆధారంగా డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని, మధిర వంటి నియోజకవర్గంలో పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణం, కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ, నీరా కేఫ్‌లు, నందనవనాల నిర్వహణపైనా సమీక్షించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భారీ పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ సమ్మిట్

- సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ– గ్లోబల్ సమ్మిట్–2026కు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడిం చారు. డిసెంబర్ 7,8,9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లపై మంగళవారం సెక్రెటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో భాగంగా ఈ నెల 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వాని స్తున్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో సమ్మిట్‌పై రోడ్‌షోలు నిర్వహించినట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో జరిగే ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని వివరించారు.

# ప్రతి ఓటరు ప్రజాస్వామ్య కాపలాదారుడే..

- కాకతీయ యూనివర్సిటీ,దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య సురేష్ లాల్
- దూరవిద్య కేంద్రంలో ఓటరు చైతన్య సదస్సు



**హనుమకొండ (జనంసాక్షి) :** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రతి ఓటరు కూడా ప్రజాస్వామ్యాన్ని రక్షించి, కాపాడుకోవాల్సిన కాపలాదారులేనని, మన ఓటు హక్కును మనం నిజాయితీగా ఉపయోగించడం వల్ల ప్రజాస్వామ్యం ఫరిడవిళ్ళుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి. సురేష్ లాల్ అన్నారు. మంగళ వారం నాడు దూరవిద్యకేంద్రం ఆవరణలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆచార్య సురేష్ లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఓటు ఒక మార్పునకు ఆయుధమని, దీనిని మనకోసం, మన అభివృద్ధి కోసం ఉపయోగించాలని, ఓటుతో అధికారాన్ని నిలబెట్టవచ్చు, కూలదోయవచ్చునని, మనకు కావలసిన అభివృద్ధిని సాధించుకోవాలంటే మనం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని అందులో భాగమే ఆత్మసాక్షిగా ఓటు వేసి, బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని, ఓటును అమ్ముకోకుండా నమ్ముకొని, పవిత్రమైన ఓటును ప్రలోభ పడకుండా విక్రమార్కుడిలా ఓటు వేసి నిజాయితీగల వ్యక్తులను గెలిపించుకోవాలని తెలిపారు. జర్నలిజం శాఖ విభాగాధిపతి ప్రముఖ సామాజిక ఉద్యమకారులు సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొరకు ప్రతి ఒక్కరూ సంబంధిత ప్రాంత బిఎల్ఓ లకు వివరాలు అందజేసి ఓటు హక్కును నిలుపుకోవాలని, అదేవిధంగా త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు ప్రతి డిప్లమా, డిగ్రీ చదివిన వ్యక్తులందరూ మరలా ఈ సంవత్సరం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడే ప్రాజెక్టు, గీసుగొండ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్, డాక్టర్ వంగాల సుధాకర్ తోపాటు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ స్థానికులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు నీట్‌లో ఉచిత శిక్షణ

- రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నీట్–2027 ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న మైనారిటీ విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ లాంగ్‌టర్మ్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా నిష్ణాతులైన సిబ్బంది చేత ఉచిత శిక్షణతో పాటు బోర్డింగ్, ఇతర సదుపాయాలను కూడా అందిస్తారని, అర్హులైన విద్యార్థులు తమ ఎస్–ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, నీట్–2026 ర్యాంక్ కార్డు లేదా స్కోర్ కార్డును స్కాన్ చేసి ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాలురు: tsrjclbnagar @gmail.com, బాలికలు: acadtmrjcboy sbarkas@gmail.com కు దరఖాస్తులు నవంబర్ 1లోపు సమర్పించాలని తెలిపారు. మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యాకూబ్ పాషా కోరారు. ఇతర వివరాలకు 8520860785 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

# పాలించడం రాకపోతే తప్పుకోండి

- గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించండి
- బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పాలన చేయడం చేతకాకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుని గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించాలని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ కలలో కనిపించేది కేసీఆర్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఆలస్యం చేసే ధోరణిని వీడి, రైతుల ప్రయోజనాల కోసం కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. నీటిని ఎత్తిపోయడానికి అవసరమైన నీటి మట్టం లేకపోతే కాఫర్ డ్యాం నిర్మించాలని సూచించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయేందుకు అవసరమైతే నెల రోజుల్లో కాఫర్ డ్యాం నిర్మించవచ్చని అన్నారు. సీతారామ ప్రాజెక్టు వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని.. అదే తరహా చర్యలను ఇక్కడా చేపట్టవచ్చన్నారు. రోజుకు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోస్తే ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని వినియో గించుకోవచ్చని పేర్కొన్నారు. వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల నుంచి నీరు, విద్యుత్ అడగబోమని సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతున్న ప్రాణహిత జలాలను వినియోగించుకునే అవకాశం ఉందని, వాటిని తాగునీరు, సాగునీటితో పాటు విద్యుత్ అవసరాలకు కూడా ఉపయోగించుకోవచ్చని అన్నారు. రైతులు పంటలు సాగు చేయకపోతే దాని ప్రభావం సమాజంలోని అన్ని వర్గాలపై పడుతుందని.. ఇప్పటికే బియ్యం ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి రైతులను పంటలు వేయవద్దని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. 30 నెలలుగా నిద్రపోయిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మహారాష్ట్రకు వెళ్లి తుమ్మిడిహెట్టి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టు కోసం ఎంతో ప్రయత్నించారని, మహారాష్ట్ర పర్యటనతో ఏం సాధించారని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు.

# చట్టం తెలుసుకుంటేనే బాల్యం సురక్షితం

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే.అవినాష్



**నారాయణపేట అక్టోబర్ 27(జనం సాక్షి):** విద్యార్థులు చట్టం తెలుసుకుంటేనే బాల్యం సురక్షితంగా ఉంటుందని నారాయణపేట అదనపు జడ్జి కే.అవినాష్ అన్నారు. మంగళవారం నారాయణపేటలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' రెండవ రోజు లో భాగంగా "కానూన్ జానో, బచ్‌పన్ బచావో" పై డి ఎల్ ఎస్ ఏ ఆధ్వ ర్యంలో అవగాహన కల్పించారు. అంశంపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జూని యర్ సివిల్ జడ్జి కే. అవినాష్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ "చట్టాన్ని తెలుసుకోండి, బాల్యాన్ని రక్షించండి', బాల్యం అనేది అమాయకత్వం, నవ్వు, ఆటలు, అభ్యాసానికి సమయం. అయినప్పటికీ, మనం మన తరగతి గదు లలో హాయిగా కూర్చుని ఉండగా, మన దేశవ్యాప్తం గా లక్షలాది మంది పిల్లలు చీకటి కర్మాగారాలలో, ఇటుక బట్టీలలో, గృహ బానిసత్వంలో చిక్కుకుపోయారనీ ఆవేదన వ్యక్తం చేశారు. వారి పుస్తకాల స్థానంలో బరువైన పని ముట్లు వచ్చాయి, అకాల ప్రసవ భారం వారి కలలను చిదిమేసింది అన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, చట్టం తెలిస్తేనే తమను తాము కాపాడుకోగలరని విద్యా ర్థినులకు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామా జి మాట్లాడుతు చట్టంపై అవగాహన ఉన్నప్పుడే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. చైల్డ్ డిపార్ట్మెంట్ సిబ్బంది మాట్లాడుతూ ముఖ్యంగా బాల్య వివాహాల నిషేధ చట్టం – 2006, బాల కార్మిక నిషేధ చట్టం – 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం, జువైనల్ జస్టిస్ చట్టం గురించి వివరిం చారు. 18 ఏళ్ల లోపు వివా హం చేయడం నేరమని, 14 ఏళ్ల లోపు పిల్లలతో పని చేయించడం శిక్షార్హ మని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతి గౌడ్ మాట్లాడు తూ డి ఎల్ ఎస్ ఏ సేవల గురించి వివరిస్తూ ఉచిత న్యాయ సహాయం, బాలి కలకు ప్రత్యేక రక్షణ, ఉచిత న్యాయవాది, పరిహారం, కౌన్సెలింగ్ వంటి సేవల గురించి వివరించారు. అనంతరం స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబా ల్ ,కరాటే పోటీల లో బంగారు పతకాలు సాధించిన ఎం అశ్విని,బి రక్షిత బాలికల పాఠశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ హమీని, జి. యాదమ్మ జడ్జి కి పరిచయం చేయగా, గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి నుల మెడలో స్వయంగా బంగారు పతకాలు వేసి అభినందించారు. ఈ సంద ర్భంగా జడ్జి మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముందుండాలని, క్రీడలు శారీరక, మానసిక వికాసాని కి ఎంతో తోడ్పడతాయని, ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ బాలాజీ, చైల్డ్ డిపార్ట్మెం ట్ కరిష్మా, నర్సిము లు, భరోసా సెంటర్ ప్రమీల, పాఠశాల ప్రధానోపా ధ్యా యులు, ఉపాధ్యాయులు, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# కూలీలు విబిజీ రామ్ జి పనులు వినియోగించుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి..



**దుగ్గొండి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. మంగళవారం దుగ్గొండి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్నటువంటి విబిజి రాంజీ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను పనులకు హాజరవుతున్న కూలీల వివరాలను సేకరించి వి బి జి రామ్ జి కూలీలను వివరాలు అడిగి తెలుసుకుని అలాగే కూలీల శాతం పెంచాలని తుఫాను హెచ్చరికతో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్ కు పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వసంత , స్థానిక ఎస్సై మహేందర్, ఏపీఓ శ్రీనివాస్ ఈసీ టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలలో ఆసిఫాబాద్ విద్యార్థినుల ప్రతిభ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి ):** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 14 నుంచి 17 తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖో ఖో ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలువగా, ఇందులో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో విజేత క్రీడాకారిణులను సన్మానించి అభినందిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాంపియన్షిప్ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులో టి.డబ్ల్యూ. మోడల్ స్పోర్ట్స్ స్కూల్ (బాలికలు), ఆసిఫాబాద్‌కు చెందిన 10 మంది క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పోటీలలో క్రీడా పాఠశాల విద్యార్థినిలు 7 మంది ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. రాబోయే పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలలో విద్యార్థినులు సాధిస్తున్న విజయాలు పాఠశాలకు గర్వకారణమని, క్రమశిక్షణ, నిరంతర సాధన, కోచ్‌ల మార్గదర్శకత్వంతో మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.డి.టి.డబ్ల్యూ. అంబాజీ, పాఠశాల పిడి మీనా రెడ్డి, కోచ్ తిరుమల్, కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో రాష్ట్ర సీఈఓ దివ్య దేవరాజన్ పరిశీలన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి ):** జిల్లాలో గ్రామీణ అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, సౌర విద్యుత్ వినియోగం, గ్రామీణ ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) దివ్య దేవరాజన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళ వారం ఐటీడీఏ పిఓ మందమ కరందు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ తో కలిసి తిర్యాణి మండలంలోని సుంగాపూర్ గ్రామ పరిధిలోని కొలంగూడ గ్రామంలో సందర్శించారు , ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, స్థానికులతో చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అని అన్నారు. గుడిపేట గ్రామంలో సౌర విద్యుత్ (సోలార్) ద్వారా వ్యవసాయ మోటార్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. సౌర విద్యుత్ వినియోగం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గుడిపేట గ్రామంలో చేపడుతున్న కోళ్ల పెంపకం కార్యక్రమాన్ని పరిశీలించి, గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చడంలో పౌల్ట్రీ పెంపకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాధి మార్గాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించి, మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. సంఘాల సభ్యులకు వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా, స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బి దత్తారావు పాల్గొన్నారు.

# నా కథ నేనే రాస్తాను

సంపాదకీయం

దశాబ్దాలుగా సోనియా గాంధీ గురించి చెప్పినవాళ్లు ఎందరో. ఆమె మాటల కంటే ఆమెపై వచ్చిన కథనాలే ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. ఇప్పుడు ఆమె తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు సంబంధించిన పోస్టుల ద్వారా నేరుగా పాఠకుల ముందుకు వచ్చారు. "ఇన్నేళ్లు వాళ్లు చెప్పారు, ఇక నావంతు" అనే ఆమె మాటల్లో ఒక వ్యక్తి తన జీవితంపై హక్కును తిరిగి కోరుకునే పట్టుదల కనిపిస్తుంది.

ఈ దేశంలోనే తాను నవ వధువునయ్యానని, ఇక్కడే విధవనయ్యానని ఆమె చెప్పిన మాట కేవలం భావోద్వేగం కాదు, ఒక జీవిత సారాంశం. ఇరవై ఏళ్ల వయసులో ఈ గడ్డపై అడుగుపెట్టి, అత్తగారి ఇందిరా గాంధీని హత్యకు కోల్పోయి, ఆపై భర్త రాజీవ్ గాంధీని కూడా దారుణంగా కోల్పోయిన స్త్రీ ఆమె. భర్త ప్రధానమంత్రి కావడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకించానని ఆమె చెప్పడం, అధికారం పట్ల ఆమె సంశయాన్ని, కుటుంబ భద్రతపై ఆమె భయాన్ని తెలియజేస్తుంది. విషాదాలను భరించిన తర్వాత కూడా ఈ దేశంలోనే నిలిచిన వ్యక్తిని "విదేశీ" అనే ముద్రతో చూడటం ఆమె అనుభవంలో అతి పెద్ద అన్యాయంగా మిగిలింది.

"సింహాలు తమ చరిత్ర తాము చెప్పుకోకపోతే వేటగాళ్లు చెప్పిందే చరిత్రగా మిగిలిపోతుంది" అనే ఆఫ్రికన్ సామెతను ఆమె ప్రతిధ్వనించారు. రాజకీయాల్లో ఈ మాట చాలా నిజం. ప్రత్యర్థులు సృష్టించిన ఇమేజ్‌కు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉంటే, అదే క్రమంగా సత్యంలా స్థిరపడుతుంది. సోనియా చాలాకాలం మౌనంగా ఉన్నారు. ఇప్పుడు ఆ మౌనాన్ని ఆమె పుస్తకం ద్వారా, తన స్వరంతో వివరించారు.

# న్యాయ వ్యవస్థపై ఎగ్జిక్యూటివ్ ప్రభావం-ప్రజాస్వామ్యానికి ప్రమాదం



భారత ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే పునాది. ఆ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన మూడు వ్యవస్థల్లో న్యాయవ్యవస్థది అత్యంత కీలకమైన స్థానం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ అధికారాలను దుర్వినియోగం చేసినప్పుడు వాటిని ప్రశ్నించి, పౌరుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై ఉంది. అలాంటి న్యాయవ్యవస్థ స్వతంత్రతపై సందేహాలు తలెత్తుతున్నాయంటే అది ఒక ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ వివాదం మాత్రమే కాదు, దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన తీవ్రమైన సమస్య. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో న్యాయమూర్తుల నియామకాలు, కేసుల కేటాయింపులు, దర్యాప్తు సంస్థల చర్యలు, పౌరహక్కుల పరిరక్షణ వంటి అంశాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలను ఈ దృష్టితోనే పరిశీలించాలి.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తన రచనలో కొలీజియం సమావేశాలకు సంబంధించిన కొన్ని పరిణామాలను ప్రస్తావించడం ఈ చర్చకు కొత్త ప్రాధాన్యం తెచ్చింది. మైనారిటీ వర్గాలకు చెందిన న్యాయమూర్తుల నియామకాలు, ప్రభుత్వ అభిప్రాయాల ప్రభావం, కేసుల కేటాయింపులపై ఆయన వెల్లడించిన అంశాలు న్యాయవ్యవస్థ స్వతంత్రతకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అయితే వీటిని నిర్ధారణ అయిన వాస్తవాలుగా పరిగణించకుండా, అధికారిక రికార్డులు, సంబంధిత వ్యక్తుల వివరణల ఆధారంగా పరిశీలించాలి. ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత ఒకవైపు ఉంటే, ప్రజాస్వామ్య సంస్థలపై తలెత్తే సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మరోవైపు ఉంటుంది.

భారత రాజ్యాంగంలోని 124వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. అయితే ఎంపిక ప్రక్రియలో కొలీజియం ప్రధాన పాత్ర పోషిస్తుంది. న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వ ప్రత్యక్ష ఆధిపత్యాన్ని నివారించడం ఈ వ్యవస్థ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. 2015లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను (ఎన్‌జేఏసీ) రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం కలిగే ప్రమాదాన్ని మెజారిటీ తీర్పు పరిగణనలోకి తీసుకుంది. అయితే కొలీజియం వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపాలను కూడా న్యాయమూర్తులే ఎత్తిచూపడం గమనార్హం.

ఎన్‌జేఏసీ తీర్పులో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన జస్టిస్ జె. చలమేశ్వర్, న్యాయమూర్తుల నియామకాల్లో జవాబుదారీతనం లేకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొలీజియం వ్యవస్థలో బంధుప్రీతికి తావు ఏర్పడిందా, ప్రతిభకు తగిన ప్రాధాన్యం లభిస్తోందా అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు. మరోవైపు, న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ కూడా కొలీజియంలో పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం లోపించాయని తన అభిప్రాయంలో పేర్కొన్నారు. అంటే సమస్య కేవలం ప్రభుత్వ జోక్యం గురించే కాదు; న్యాయవ్యవస్థ తన నియామక ప్రక్రియను సంస్కరించుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

న్యాయమూర్తుల ఎంపికలో కులం, మతం వంటి అంశాలకంటే న్యాయపరిజ్ఞానం, నిజాయితీ, వృత్తిపరమైన సామర్థ్యం, రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు సహా అన్ని సామాజిక వర్గాలకు న్యాయవ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. సామాజిక వైవిధ్యం, ప్రతిభ పరస్పర విరుద్ధమైనవి కావు. అర్హతలకు భంగం కలగకుండా సమాన అవకాశాలను నిర్ధారించడం ప్రజాస్వామ్య బాధ్యత.

కేసుల కేటాయింపులోనూ పారదర్శకత తప్పనిసరి. ఒక కేసు మరో ధర్మాసనానికి బదిలీ కావడం మాత్రమే ప్రభుత్వ జోక్యానికి నిదర్శనం కాదు. అయితే కీలకమైన కేసుల కేటాయింపులో అనుసరించే ప్రమాణాలు స్పష్టంగా ఉండాలి. పరిపాలనా కారణాలతో మార్పులు జరిగితే వాటికి తగిన వివరణ ఉండాలి. న్యాయం జరగడమే కాకుండా, అది నిష్పాక్షికంగా జరిగిందనే విశ్వాసం ప్రజల్లో కలగాలి. న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య కేసుల పెండింగ్. 2026 ఫిబ్రవరి 10 నాటికి దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు, దిగువ న్యాయస్థానాల్లో కలిపి 5.46 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ పార్లమెంటుకు తెలిపింది. న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయడం, కోర్టుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, న్యాయ సహాయాన్ని విస్తరించడం అత్యవసరం. ఆలస్యమైన న్యాయం సామాన్యులకు అందని న్యాయంగా మారకూడదు.

న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత; దాని పారదర్శకతను పెంచుకోవడం న్యాయవ్యవస్థ బాధ్యత. నియామకాలకు స్పష్టమైన ప్రమాణాలు, కొలీజియం నిర్ణయాలకు సముచిత వివరణలు, కేసుల కేటాయింపులో పారదర్శక విధానం, ప్రభుత్వ జోక్యంపై రాజ్యాంగపరమైన నియంత్రణలు అవసరం. బీజేపీ అయినా, మరే ఇతర పార్టీ అయినా రాజకీయ మెజారిటీని రాజ్యాంగ సంస్థలపై ఆధిపత్యానికి ఉపయోగించకూడదు. అదే సమయంలో న్యాయవ్యవస్థ తన లోపాలను విమర్శలకు అతీతమైనవిగా భావించరాదు. ప్రభుత్వానికి విధేయంగా ఉండటం న్యాయస్థానాల విధి కాదు; రాజ్యాంగానికి నిబద్ధంగా ఉండటమే వాటి ధర్మం. న్యాయవ్యవస్థ స్వతంత్రత బలహీనపడితే, చివరకు బలహీనపడేది పౌరుల హక్కులే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# విలువల వెతుకులాట

తేటగీతుల తేనెల దీర్చిదిద్ది
లలిత పదముల ధర్మాల వెలయఁజెప్పి
బుధజనుల నెల్ల మేల్కొల్పు పూతచరిత!
లక్ష్మయ కవీంద్రు కవనమ్ము రమ్యమవని!

గడ్డం లక్ష్మయ్య "ఉషోదయ సుభాషిత శతకము" చదివినప్పుడు మొదటగా కనిపించేది – ఒక కవి తన చుట్టూ ఉన్న సమాజాన్ని గమనిస్తూ, తాను నమ్మిన విలువలను పద్యరూపంలో పాఠకుడితో పంచుకోవాలనే తపన.

ఈ శతకానికి "బుధజన సమూహమునకు శుభోదయంబు" అనే మకుటాన్ని ఎంచుకోవడం ఒక ప్రత్యేకమైన ఆలోచన. రచయిత స్వయంగా చెప్పిన ప్రకారం, ఒక సందర్భంలో జయశంకర్ సారస్వత సమితి వాట్సాప్ సమూహంలో ఈ మకుటంతో ఒక తేటగీతి పద్యం పంపడం మొదలై, ఆ తర్వాత 108 రోజుల పాటు ఒక యజ్ఞంలా ప్రతిరోజూ ఒక పద్యాన్ని, దానికి అనుగుణమైన చిత్రంతో పంపే నిరంతర సాహిత్య ప్రయాణంగా ఈ శతకం రూపుదిద్దుకుంది. అందువల్ల ఈ పుస్తకాన్ని కేవలం ఒక శతకంగా కాకుండా, ప్రతిరోజూ ఉదయాన్నే ఒక మంచి ఆలోచనను సమాజం ముందుంచే వినూత్న ప్రయోగంగా చూడవచ్చు.

**మకుటమే ఈ శతకానికి ప్రత్యేక ఆకర్షణ**

"బుధజన సమూహం" అంటే కేవలం పండితులు మాత్రమే కాదని రచయిత విస్తృతంగా భావించారు. పండితులు, గురువులు, విజ్ఞానులు, జిజ్ఞాసువులు, సాహితీవేత్తలు, సంగీతజ్ఞులు మాత్రమే కాకుండా అమ్మ, నాన్న, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సర్వహితులు కూడా ఆ పరిధిలోకి వస్తారని శతక సమాప్తిలో స్పష్టం చేశారు:

"అమ్మ కరుణార్ద్రమూర్తి సహాయకారి
తంద్రిబాధ్యతల్ నెఱపు సంధానకర్త!
గురువు జ్ఞానవిధాత, సద్దోష్టినిచ్చు
సఖులు, శ్రేయోభిలాషులు, సర్వహితులు
బుధజనసమూహమునకు శుభోదయంబు!"

ఇది శతకానికి ఒక ఉదాత్తమైన మానవీయ విస్తృతిని ఇచ్చింది.

విషయ వైవిధ్యం -- రసనిష్యందిత భావాలు

మొదటి పద్యాల్లోనే విఘ్నేశ్వరుడు, సరస్వతీ దేవి, గురువందనం, నీతి, ధర్మం, విజ్ఞానం వంటి అంశాలతో ప్రారంభమై, తర్వాత విద్యాగంధం, సాహిత్యం, సంగీతం, లలిత కళలు, దానం, సామాజిక బాధ్యత, పాలన, ప్రకృతి సౌందర్యం వంటి సమస్త జీవన పార్శ్వాల వైపు కవిత్వం విస్తరిస్తుంది.

సమాజంలో శ్రమదానానికి ఉన్న విశిష్టతను వివరిస్తూ –

"వృత్తులన్ని పవిత్రమే! వృద్ధికొరకు!
మనుజులందరమొక్కటన్ మర్మమెఱిఁగి
యుండ లోకకళ్యాణమౌ!

అని ప్రబోధిస్తూ ఏ వృత్తీ తక్కువది కాదని, సమానత్వ భావనను చాటారు. అలాగే కుల, మత, వర్గ, భాషా భేదాల కుత్సితత్వాన్ని నిరసిస్తూ

"కుటిల జాత్యహంకారము కులవివక్ష
సంకుచిత ధోరణులు దేశ సఖ్యతగున?
మానవత్వమే జనుల సన్మార్గమైన లోకమే వెల్గు!

అంటూ రాజ్యాంగబద్ధమైన లౌకిక, ప్రజాస్వామిక సమైక్యతా దృక్పథాన్ని బలంగా వినిపించారు.

సుభాషితం మాత్రమే కాదు... సామాజిక హెచ్చరిక కూడా..

ఈ శతకంలోని పద్యాలు కేవలం మంచి మాటలు చెప్పడం దగ్గరే ఆగిపోవు; సమాజంలోని లోపాలను సూటిగా ప్రశ్నిస్తాయి. పరిపాలకులు బాధ్యతాయుతంగా ఉండాలని హెచ్చరిస్తూ కవి సంధించిన ప్రశ్న అక్షరాయుధంలా ఉంటుంది:

"ప్రభుత సంస్కరణలతోను పాటుపడక
కాలమును వెళ్ళదీసి ప్రగల్భములను
పలికి, ప్రజల వంచించునా పాలనెట్లు?
నిత్య చైతన్య ధీర నినాదమిచ్చు
బుధజన సమూహమునకు శుభోదయంబు




అలాగే ఆధునిక జీవనపు యాంత్రికతలో సమసిపోతున్న ఆర్ద్రతను నిలదీస్తూ:

"ఆధునిక జీవనములోన ఆర్ద్రతెంత?
మానవీయవిలువల ప్రమాణమెంత?
నిర్ధనులకివ్వలేనట్టి నిహితమైన సంపదేల?

అని పాఠకుడి గుండెలను ఆలోచనలతో తడమడం కవి సామాజిక స్పృహకు నిదర్శనం. "రమ్యమౌవాక్కు నీకు శ్రీరామరక్ష", "వాక్కు కత్తికన్నను వాడి" అంటూ సంభాషణా సౌందర్యాన్ని, నైతిక విలువల ప్రాధాన్యతను కూడా హెచ్చరికగా గుర్తుచేశారు.

సరళత – ఈ శతకానికి బలం

తేటగీతి ఛందస్సులో చిన్న చిన్న పదాలతో అనల్పమైన భావాన్ని ఒలికించి, సామాన్య పాఠకుడు కూడా సులభంగా ఆస్వాదించేలా చేయడం ఈ కృతిలోని విశేష శిల్పం. ప్రతి పద్యానికి ఒక అర్థవంతమైన చిత్రాన్ని జతపరచడం, కింద సరళ గ్రాంథికంలో తాత్పర్యాన్ని అందించడం వల్ల ఇది అటు పండితులనే కాక, ఇటు నేటి బాలలను, విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

దేశానికి రక్షణ కవచాలైన సైనికులకు, అన్నంపెట్టే రైతులకు, విద్యాదాతలైన గురువులకు, ప్రాణదాతలైన వైద్యులకు ఈ పుస్తకాన్ని అంకితం ఇవ్వడం రచయిత ఉన్నత సంస్కారానికి ప్రతీక.

**నా వ్యక్తిగత స్పందన:**

ఈ శతకం చదివిన తర్వాత నాకు కలిగిన ప్రధాన భావన – కవి సమాజాన్ని మార్చాలని శాసించడం కంటే, ముందుగా మనిషి తనను తాను పరిశీలించుకోవాలని కోరుతున్నాడు.

- "నేను సమాజంతో ఎలా మాట్లాడుతున్నాను?"
- "నా జీవన బాధ్యత ఏమిటి?"
- "నా వల్ల తోటి నిర్ధనుడికి ఏమైనా ఉపయోగం ఉందా?"
- "కులం, మతం, ప్రాంతాల సంకెళ్లు దాటి మానవత్వంతో ఆలోచిస్తున్నానా?"
- "చదువు నాకు కేవలం లౌకిక సంపదనే ఇచ్చిందా... లేక వివేకపు సంస్కారాన్ని కూడా నేర్పిందా?"

ఇలాంటి మౌలిక ప్రశ్నలను పాఠకుడి అంతరంగంలో నాటడమే ఈ శతకం సాధించిన పరమార్థం. రచయిత తన పుస్తకాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు చదివి నైతిక పురోగతి సాధించాలని ఆశించారు. భవిష్యత్తులో సహృదయులు అందించే సలహాల ఆధారంగా తదుపరి ముద్రణలో మార్పులు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన వినమ్రంగా ప్రకటించడం వారి అభ్యాస శీలతకు నిదర్శనం.

ఉషోదయం అంటే కేవలం చీకటి తొలగి సూర్యుడు రావడం మాత్రమే కాదు... మనలోని అజ్ఞానపు నిద్ర వీడి విలువల ఆలోచనలు మేల్కొనడం. ఆ అర్థంలో "ఉషోదయ సుభాషిత శతకము" ప్రాతఃకాలపు శుభాకాంక్షల సంకలనం మాత్రమే కాదు; నిత్య జీవితానికి నైతిక దిక్సూచిగా నిలిచే అమూల్యమైన సుభాషితాల పెన్నిధి.

ఆత్మీయ మిత్రులు గడ్డం లక్ష్మయ్య కలం నుంచి ఇలాంటి లోకోపకారక సాహిత్య కావ్యాలు మరెన్నో వెలువడాలని మనసారా ఆకాంక్షిస్తూ, వారికి నా హృదయపూర్వక అభినందనలు.

- గోగులపాటి కృష్ణమోహన్
సీనియర్ జర్నలిస్టు
9700007653

## పగటి చుక్క

ఇలా రావడం
అలా పోవడం
కాల సూచిక
జీవి రావడం
జీవి పోవడం
ఆయు సూచిక
పంచ భూతాలు
భూ పరిధిలో జీవితాలు
జీవులు విభిన్న కోణాలు
లోపటి కన్నులు
గుండె సవ్వడులు
బంధుత్వ సిరలు దమనులు
దారుల ఆటుపోటులు
బలాలు బలహీనతలు
జీవదర్పణ సుఖదుఃఖాలు
కులాల గజ్జితామరలు
మతాల మత్తుమబ్బుల దుప్పట్లు
మనసు మసక బారిన వెన్నెలలు
పై అన్ని
రేగడి మడిని
తిరగ మరగ చదును చేసి
మడిలోని మొలకలే
మానవ జీవన బతుకులు
రాలేవి కొన్ని
పరిగెలు కొన్ని
గట్టి గింజలు కొన్ని
నిలబడేవి
వెలుగులు జిమ్మేవి
కోటానొక్కటే కదా!

రేడియమ్
9291527757

# ఆర్థిక క్రమశిక్షణే సంక్షోభాలకు రక్షణ కవచం!

నిన్నటి సంచిక తరువాయి

కాబట్టి ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఉత్పత్తి పెంపు, సరఫరా వ్యవస్థ మెరుగుదల, ధరల పర్యవేక్షణ, సమర్థవంతమైన ఆర్థిక విధానాలు కూడా అవసరం. ప్రతి కుటుంబం నెలవారీ ఆదాయం, తప్పనిసరి ఖర్చులు, అప్పుల చెల్లింపులు, పొదుపులను లెక్కించుకోవాలి. అత్యవసర పరిస్థితుల కోసం కొంత మొత్తాన్ని క్రమంగా పక్కన పెట్టుకోవడం మంచిది. అధిక వడ్డీకి అప్పులు తీసుకోవడం, ఆదాయానికి మించిన విలాసవంతమైన ఖర్చులు చేయడం, అవసరం లేని వస్తువులను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేయడం వంటి అలవాట్లను నియంత్రించాలి. అయితే తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు పొదుపు చేయడం కష్టమవుతుందనే వాస్తవాన్ని కూడా గుర్తించాలి. అందువల్ల ఆర్థిక క్రమశిక్షణతో పాటు తగిన ఆదాయం, ఉపాధి, సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత.

### ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ.. ప్రజాధనం పవిత్ర బాధ్యత

ప్రభుత్వం చేసే ప్రతి ఖర్చు వెనుక ప్రజల శ్రమ, పన్నులు, ప్రభుత్వ ఆదాయ వనరులు ఉంటాయి. అందువల్ల ప్రజాధనాన్ని వినియోగించడంలో ప్రభుత్వానికి అత్యున్నత బాధ్యత ఉంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అధికారిక వాహనాలు, ప్రయాణాలు, సమావేశాలు, కార్యాలయ నిర్వహణ వంటి అంశాలపై ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి. అనవసరమైన వాహనాల వినియోగం, అవసరం లేని ప్రయాణాలు, ఆడంబర కార్యక్రమాలు, ప్రయోజనం లేని వ్యయాలు తగ్గించాలి. అయితే ప్రభుత్వ ఖర్చులన్నింటినీ ఒకే గాటన కట్టడం కూడా సరైంది కాదు. ప్రజారోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ మౌలిక సదుపాయాలు, గ్రామీణ ఉపాధి వంటి రంగాల్లో చేసే ఖర్చులు సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయి. కాబట్టి ఆర్థిక క్రమశిక్షణ అంటే ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయకపోవడం కాదు. ప్రజాధనాన్ని వృథా చేయకుండా, ప్రాధాన్యతలను నిర్ణయించి, ప్రతి రూపాయికి తగిన సామాజిక ప్రయోజనం కలిగేలా వినియోగించడం.

రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయం, వ్యయం, అప్పులు, వడ్డీ చెల్లింపులు, భవిష్యత్తు బాధ్యతలను సమగ్రంగా అంచనా వేయాలి. ఆదాయానికి మించిన ఖర్చులను నిరంతరం కొనసాగిస్తే అప్పుల అవసరం పెరుగుతుంది. అప్పులపై వడ్డీ చెల్లింపులకు ఎక్కువ నిధులు కేటాయించాల్సి వస్తే విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, ఉపాధి వంటి రంగాలకు అందుబాటులో ఉండే నిధులు పరిమితం కావచ్చు. అయితే అప్పు తీసుకోవడం ప్రతిసారీ తప్పు కాదు. దీర్ఘకాలిక ఉత్పాదక ఆస్తులను సృష్టించే పెట్టుబడులకు, అత్యవసర సంక్షోభాల నిర్వహణకు తీసుకునే అప్పులు సమర్థనీయమవుతాయి. సమస్య ఏమిటంటే, అప్పులు ఏ ప్రయోజనం కోసం తీసుకుంటున్నాం, వాటి వల్ల భవిష్యత్తులో ఎంత ఆదాయం లేదా సామాజిక ప్రయోజనం వస్తుంది, వాటిని తిరిగి చెల్లించే సామర్థ్యం ఎంత అనే అంశాలను స్పష్టంగా అంచనా వేయకపోవడం.

బడ్జెట్‌లో కేటాయించిన నిధులు వాస్తవంగా ఏ పనులకు ఖర్చయ్యాయి, ఆ పనుల వల్ల ప్రజలకు ఏమి ప్రయోజనం కలిగింది అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత, పోటీ పద్ధతులు, సామాజిక తనిఖీలు, స్వతంత్ర ఆడిట్, శాసనసభ పర్యవేక్షణ బలోపేతం కావాలి. ఆర్థిక క్రమశిక్షణను కేవలం ప్రకటనలతో సాధించలేం. స్పష్టమైన నియమాలు, కఠినమైన అమలు, ప్రజలకు జవాబుదారీతనం అవసరం.



### విద్యుత్, నీటి కొరత.. వృథా నియంత్రణే ముందస్తు రక్షణ

కరువు పరిస్థితుల్లో విద్యుత్, నీరు రెండూ కీలక వనరులుగా మారతాయి. సాగునీటి అవసరాలు పెరగడం, భూగర్భజలాలపై ఆధారపడటం, విద్యుత్ పంపుల వినియోగం పెరగడం వల్ల వ్యవస్థలపై అదనపు ఒత్తిడి ఏర్పడుతు ంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా, పారిశ్రామిక అవసరాలు, గృహ వినియో గం మధ్య సమతుల్యత సాధించడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో నీటి వృథాను అరికట్టడం, చెరువులు, కుంటలు, కాలువలు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను సంరక్షించడం, భూగర్భజలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవ డం అత్యవసరం. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, స్థానిక సంస్థల్లో విద్యుత్ వినియోగాన్ని సమీక్షించాలి. అవసరం లేని సమ యంలో దీపాలు, శీతలీకరణ పరికరాలు, ఇతర విద్యుత్ పరికరాలు పనిచేయకుండా చూడాలి. నీటి సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి. ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణను ప్రోత్సహించాలి.

ఆర్థిక క్రమశిక్షణ అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన అంశమని భావించడం పొరపాటు. ప్రతి కుటుంబం తన ఆదాయం, అవసరాలు, భవిష్యత్తు బాధ్యతలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలి. ఆహారం, నీరు, విద్యుత్, ఇంధనం వంటి వనరులను వృథా చేయకూడదు. అవసరం లేని ఖర్చులను తగ్గించుకోవాలి. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి. అప్పు తీసుకునే ముందు తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయాలి. కుటుంబంలోని పిల్లలకు కూడా పొదుపు, వనరుల పరిరక్షణ, బాధ్యతాయుత వినియోగం గురించి అవగాహన కల్పించాలి.

అదే సమయంలో ఆర్థిక సంక్షోభాల సమయంలో సామాజిక ఐక్యత మరింత అవసరం. పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రోజువారీ కూలీలు, ఉపాధి కోల్పోయిన కుటుంబాలు ఎక్కువగా ప్రభావితమవుతారు. వారికి సహాయం అందించడం సమాజంలోని సంపన్న వర్గాల సామాజిక బాధ్యత. ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి అందించడం, స్థానిక సహాయక కార్యక్రమాలకు తోడ్పడడం, నీటి సంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చర్యలు సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతాయి. అయితే పేదరికాన్ని కేవలం వ్యక్తిగత ఖర్చుల సమస్యగా చూడకూడదు. తక్కువ వేతనాలు, ఉపాధి అస్థిరత, వైద్య ఖర్చులు, విద్యా వ్యయాలు, అప్పుల భారం వంటి నిర్మాణాత్మక సమస్యలు కూడా కుటుంబాల ఆర్థిక స్థితిని ప్రభావితం చేస్తాయి. అందువల్ల వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఉపాధి కల్పన, సముచిత వేతనాలు, నాణ్యమైన ప్రజా సేవలు, సామాజిక భద్రతా పథకాలు సమర్థంగా అమలు కావాలి.

### ముఖ్యమంత్రి మాటలు.. ఆచరణలో ప్రభుత్వ బాధ్యత

ప్రభుత్వాధినేతలు ప్రజలకు పొదుపు, క్రమశిక్షణ, వనరుల పరిరక్షణ గురించి సూచనలు చేయడం అవసరమే. కానీ ఆ సూచనలకు విశ్వసనీయత రావాలంటే ప్రభుత్వ వ్యవహారశైలిలోనూ అవే విలువలు ప్రతిబింబించాలి. ప్రజలకు ఖర్చులు తగ్గించుకోవాలని చెబుతూ ప్రభుత్వ విభాగాలు అనవసర వ్యయాలు కొనసాగిస్తే ప్రజల్లో విశ్వాసం తగ్గుతుంది. అందువల్ల ముఖ్యమంత్రి నుంచి గ్రామస్థాయి ప్రజాప్రతినిధి వరకు ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతాయుత వ్యయానికి ఆదర్శంగా నిలవాలి.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించడం, ఆదాయ వనరులు, అప్పుల స్థితి, వడ్డీ చెల్లింపులు, సంక్షేమ వ్యయాలు, మౌలిక సదుపాయాల పెట్టుబడుల వివరాలను క్రమం తప్పకుండా వెల్లడించడం అవసరం. ఆర్థిక పరిమితులు ఉన్నప్పుడు ఏ ఖర్చులకు ప్రాధాన్యత ఇస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. అనవసర వ్యయాలను తగ్గించే చర్యలు, నీటి సంరక్షణ ప్రణాళికలు, ఆహార భద్రతా చర్యలు, వ్యవసాయ సంక్షోభ నివారణ కార్యక్రమాలు కాలపరిమితితో అమలు కావాలి.

ప్రభుత్వం చేసే ప్రతి పొదుపు చర్యకు ప్రజా ప్రయోజనం ఉండాలి. ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, రైతు సహాయం, ప్రజారోగ్యం, విద్య వంటి అవసరమైన రంగాల్లో నిధుల కొరత ఏర్పడకుండా జాగ్రత్త పడాలి. ఆర్థిక క్రమశిక్షణ పేరుతో సంక్షేమాన్ని తగ్గించడం పరిష్కారం కాదు. అనవసర వ్యయాలను నియంత్రించి, అవసరమైన సేవలను సమర్థంగా అందించడం నిజమైన ఆర్థిక నిర్వహణ.

### కరువు నివారణకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం

కరువు వచ్చిన తర్వాత ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం, ఆహార సహాయం అందించడం వంటి అత్యవసర చర్యలు అవసరమే. కానీ ప్రతి సంక్షోభం తర్వాత అదే చర్యలపై ఆధారపడకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. వర్షపాతం అంచనాలు, జలాశయాల నిల్వలు, భూగర్భజలాల స్థితి, పంటల సాగు వివరాలు, ఆహార ధాన్యాల నిల్వలు, ధరల మార్పులను సమగ్రంగా పరిశీలించే వ్యవస్థ ఉండాలి. అలాగే రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో కరువు వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక నిధులు, విపత్తు నిర్వహణ ఏర్పాట్లు ఉండాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత నిధుల కోసం హడావుడిగా అప్పులు చేయాల్సిన పరిస్థితి తగ్గేలా ముందస్తు ఆర్థిక సంసిద్ధతను పెంపొందించాలి.

### పొదుపు వ్యక్తిగత అలవాటు.. ఆర్థిక క్రమశిక్షణ సామూహిక బాధ్యత

ప్రకృతి ఎప్పుడు అనుకూలిస్తుందో, ఎప్పుడు ప్రతికూలిస్తుందో మనిషి పూర్తిగా నిర్ణయించలేడు. కానీ ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని ఎంతవరకు తగ్గించుకోవచ్చో మాత్రం మన విధానాలు, ప్రణాళికలు, అలవాట్లు నిర్ణయిస్తాయి. కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆహారం, నీరు, విద్యుత్, ఉపాధి, ఆదాయం వంటి అంశాలన్నీ పరస్పరం ప్రభావితం అవుతాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజం బాధ్యతాయుత వినియోగాన్ని అలవర్చుకోవాలి. ప్రభుత్వం ప్రజాధనాన్ని పారదర్శకంగా, ప్రయోజనకరంగా వినియోగించాలి. రైతులకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ ఆర్థిక బాధ్యత అంటే ప్రజలకు అందాల్సిన సేవలను తగ్గించడం కాదు; ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి వినియోగించడం.

ప్రజలు పొదుపును పాటించాలి.. ప్రభుత్వం పారదర్శకతను పాటించాలి.. పాలకులు జవాబుదారీతనాన్ని పాటించాలి.. సమాజం పరస్పర సహకారాన్ని పాటించాలి. ఈ నాలుగు సూత్రాలు ఆచరణలోకి వస్తే కరువు, ధరల పెరుగుదల, ఆర్థిక అనిశ్చితి వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. ప్రకృతి వనరుల పరిరక్షణ, ప్రజాధనానికి గౌరవం, సామాజిక న్యాయం, భవిష్యత్తు తరాల సంక్షేమం కలిసినప్పుడే నిజమైన ఆర్థిక క్రమశిక్షణ సాధ్యమవుతుంది. సంక్షోభం వచ్చిన తర్వాత మేల్కొనడం కంటే, సంక్షోభం రాకముందే సిద్ధపడటమే వివేకవంతమైన సమాజానికి, బాధ్యతాయుత ప్రభుత్వానికి అసలైన పరీక్ష.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రతి ఉద్యమకారుడికి ఇంటి స్థలం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఇబ్రహీంపట్నం నుంచే శ్రీకారం
- జీవో వచ్చిన 24 గంటల్లో స్థలాలు చూపిస్తా
- తొర్రూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల 'అలయ్ బలయ్' సమ్మేళనం
- కేసీఆర్ ఒక్కరి పోరాటంతో తెలంగాణ రాలేదు
- వచ్చే ఎన్నికల్లో 80 వేల మెజార్టీతో గెలుస్తా



**రంగారెడ్డి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తొర్రూర్‌లో రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో వచ్చిన 24 గంటల్లోనే అర్హులైన ఉద్యమకారులకు వారు కోరిన ప్రాంతంలో స్థలాలు చూపించే బాధ్యత తనదని భరోసానిచ్చారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ ఒక్కరి పోరాటంతో రాలేదని, ఎందరో ఉద్యమకారులు, అమరుల త్యాగాల ఫలితంగానే సాకారమైందని మల్‌రెడ్డి గుర్తు చేశారు. ఏ ఆకాంక్షల కోసమైతే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఇచ్చారో, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ లక్ష్యాలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాలు, అవినీతితో ఒక్క కుటుంబం మాత్రమే బాగుపడి, రాష్ట్రాన్ని ఆగం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉద్యమకారులను గౌరవించేందుకు ఇప్పటికే హైలెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

**మళ్లీ గెలిచాక ఇళ్ల నిర్మాణం..**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను కనీసం 80 వేల మెజార్టీతో గెలవకపోతే రాజకీయాల నుంచే తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఈ దఫా ఉద్యమకారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వారి సొంత స్థలాల్లో ఉచితంగా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ 'అలయ్ బలయ్' కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ డివిజన్ మల్లంపేట్ సాయి బాలాజీ కాలనీలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి విజయానికి కాలనీ సభ్యులు, పార్టీ నాయకులు కృషి చేయాలని దుండిగల్ పురపాలక తొలి చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సాయి బాలాజీ కాలనీలోనీ నాయకులు కాలని సభ్యుల నమోదు ప్రక్రియ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన పట్ట భద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మాదాస్ వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, బీఆర్ఎస్ సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ శామీర్పేట్ రంగయ్య, మాజీ వార్డు సభ్యులు బాల కృష్ణ, నాయకులు అశోక్, బీఆర్ఎస్వి నాయకులు కుంట్ల మనీష్, మరియు కాలనీ సభ్యులు, జైవీర్, భూపాల్, శ్రవణ్, రమేష్, సుంకన్న, లక్ష్మీనారాయణ, రాజేందర్ రెడ్డి, దశరథ్ మరియు తదితరులు పాల్గొన్నారు.




## తాండూరులో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

- 34వ వార్డులో 10 రోజులుగా నీటి సరఫరా బంద్



**తాండూరు, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యపై 34వ వార్డు కౌన్సిలర్ పటేల్ సుప్రీతా కరుణాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఇంకా ఎండాకాలం రాకముందే ప్రజలకు మంచినీటి సమస్య రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సుప్రీతా కరుణాకర్ మాట్లాడుతూ గత 10 రోజులుగా వార్డులో నీటి సరఫరా లేదు. ప్రజలు తాగడానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఎలా. తక్షణమే ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, చైర్మన్ నీరజ బాల్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ మరియు అధికారులు స్పందించి ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వార్డులోని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీరని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున మున్సిపాలిటీని ముట్టడించి ధర్నా కార్యక్రమం చేపడతామని ఆమె హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో వార్డు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# త్రోబాల్‌లో మెరిసిన బండ మౌనిక

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- కోల్‌కతా వేదికగా జరగనున్న జాతీయ స్థాయి త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం
- రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన టీపీఎస్ విద్యార్థిని
- మల్‌రెడ్డి స్నేహ-అభిషేక్‌రెడ్డి ఆర్థిక సాయం

**రంగారెడ్డి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంత క్రీడాకారులు పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆరుట్ల బిడ్డ, త్రోబాల్ క్రీడాకారిణి బండ మౌనిక నిరూపించింది. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మౌనిక, తన అద్భుత ఆటతీరుతో జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికై ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది.

**రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి..**

ఆరుట్లకు చెందిన బండ చంద్రయ్య - పద్మ దంపతుల కుమార్తె అయిన మౌనిక, గతేడాది సెప్టెంబర్ 27న జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. తన ఆల్ రౌండ్ ప్రతిభతో సెలక్టర్లను ఆకట్టుకుని, త్వరలో కలకత్తా (కోల్‌కతా) వేదికగా జరగనున్న జాతీయ స్థాయి త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించింది.

**మల్‌రెడ్డి యువశక్తి ఆర్థిక ప్రోత్సాహం..**

సామాన్య రైతు కుటుంబానికి చెందిన మౌనిక జాతీయ స్థాయికి ఎంపికైన విషయం తెలుసుకున్న 'మల్‌రెడ్డి యువశక్తి' కన్వీనర్ మల్‌రెడ్డి స్నేహ-అభిషేక్‌రెడ్డి స్పందించారు. క్రీడల్లో ఆమె మరింత ముందుకు వెళ్లేందుకు వీలుగా ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో టీపీఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని మౌనికకు అందజేశారు.

**అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి..**

ఈ సందర్భంగా మల్‌రెడ్డి స్నేహ-అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో బోలెడంత ప్రతిభ దాగి ఉందన్నారు. సరైన సమయానికి ప్రోత్సాహం అందిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మౌనిక కలకత్తా పోటీల్లో విజయం సాధించి, భవిష్యత్తులో



అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, మన ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, మల్‌రెడ్డి యువశక్తి ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొని

## మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యం



**కాప్రా, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి తమ లక్ష్యం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, ఈసీ నగర్, రామకృష్ణ నగర్‌లో కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్డు, తొమ్మిది లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, ఈసీ నగర్, రామకృష్ణ నగర్ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న 900 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన అని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీల్లో రహదారుల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహేష్ గౌడ్ , శ్రీకాంత్ రెడ్డి, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణ కోసం మే కార్డన్ సర్చ్ నిర్వహించామని నారాయణపేట డీఎస్పీ ఎన్. లింగయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో మంగళవా రం తెల్లవారుజామున ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు డీఎస్పీ నల్లపు లింగయ్య ఆధ్వ ర్యంలో కమ్యూనిటీ కాంటా క్ట్ ప్రోగ్రాం (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొని కాలనీలోని 180 ఇళ్లను తనిఖీ చేశారు. సరైన వాహన పత్రాలు లేని 41 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. వీటి లో 39 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు ఉన్నాయ ని వెల్లడించారు. ఈ సంద ర్భంగా కాలనీ ప్రజలతో పోలీసులు సమావేశమై నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదా ర్థాలకు యువత దూరంగా ఉండాలని, ఎవరైనా మాద కద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతు న్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచిం చారు. అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కాలనీలో దొంగతనాలు, ఇతర నేరాలను అరిక ట్టేందుకు ప్రజలు స్వచ్ఛం దంగా సీసీ కెమెరాలను ఏర్పాటు



చేసుకోవాలని సూచించారు. సీసీ కెమె రాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని వివరించారు. అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యా దు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లా డుతూ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాం ఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహ కరిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీస్ శాఖతో కలిసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవ హరించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో సిఐ శివశంకర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, గాయత్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు నూతన భవనంపై దృష్టి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- న్యాయవాదుల సమస్యలకు పరిష్కారం చూపిస్తాం
- ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్‌తో ఎమ్మెల్యే సమావేశం
- ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి



**రంగారెడ్డి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** దశాబ్దాల క్రితం నిర్మించిన ఇబ్రహీంపట్నం కోర్టు భవనం స్థానంలో నూతన కట్టడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కోర్టు నూతన భవనం అంశం ఇప్పటికే పరిశీలనలో ఉందని, కొత్త భవన నిర్మాణంతో పాటు కోర్టుకు వెళ్లే రోడ్డు సౌకర్యాన్ని త్వరలోనే కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో న్యాయవాదులు పోషించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక బిల్లును ఆమోదించడంతో పాటు వారి సంక్షేమం కోసం నిధులు కూడా కేటాయించిందని గుర్తు చేశారు. న్యాయవాదుల ఒక్కో సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా, వృత్తిరీత్యా న్యాయవాది అయిన సామ రామ్మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపినట్లు తెలిపారు. పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకుని, రామ్మోహన్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయవాదుల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, అందుకే ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని, ఈ అభివృద్ధి ప్రయాణంలో న్యాయవాదులంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీపీ వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు రాములు, వెంకట్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో భారీ చోరీ..

- 30 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరణ
- న్యూ భారత్ నగర్ కాలనీలో భాస్కర్ రెడ్డి ఇంట్లో చోరీ
- కుటుంబ సభ్యులు కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లిన సమయంలో ఘటన
- బుర్కా ధరించి ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు..
- గంటసేపు ఇంట్లోనే మకాం సీసీ కెమెరాల్లో రికార్డైన చోరీ దృశ్యాలు..
- నిందితుడి కోసం పోలీసుల దర్యాప్తు



**ఉప్పల్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ఉప్పల్ ప్రాంతంలో భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. న్యూ భారత్ నగర్ కాలనీలో నివాసముంటున్న భాస్కర్ రెడ్డి ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని దుండగుడు భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకెళ్లాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లిన సమయాన్ని అదునుగా తీసుకున్న దుండగుడు ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన నిందితుడు సుమారు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడాన్ని గమనించిన దుండగుడు పక్కా ప్రణాళికతోనే చోరీకి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బుర్కా ధరించి వచ్చి.. గంటసేపు ఇంట్లోనే..!**

ఈ చోరీ ఘటనలో దుండగుడు బుర్కా ధరించి ఇంట్లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన నిందితుడు దాదాపు గంటసేపు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తూ బంగారు ఆభరణాలు, నగదును గుర్తించి అపహరించినట్లు తెలుస్తోంది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే నిందితుడు ఇంట్లోకి ఏ సమయంలో ప్రవేశించాడు? ఏ మార్గంలో వచ్చాడు? చోరీ అనంతరం ఎటువైపు వెళ్లాడు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాల్లో కీలక దృశ్యాలు రికార్డైనట్లు సమాచారం.

**సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

ఇంట్లో చోరీ జరిగిన విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఉప్పల్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడి కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. బుర్కా ధరించి వచ్చిన వ్యక్తి ఎవరనే కోణంలోనూ విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. నిందితుడు ఒక్కడే ఈ చోరీకి పాల్పడ్డాడా? మరెవరైనా సహకరించారా..? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**కాలనీవాసుల్లో ఆందోళన**

ఒకే ఘటనలో 30 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరణకు గురైనట్లు తెలియడంతో న్యూ భారత్ నగర్ కాలనీ వాసుల్లో ఆందోళన నెలకొంది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించాలని స్థానికులు భావిస్తున్నారు. ఈ భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు త్వరగా గుర్తించి, అపహరణకు గురైన బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఆశిస్తున్నారు. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడి ఆచూకీ, చోరీకి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

## యంజాల్లో అక్రమ నిర్మాణాలు, మట్టి తవ్వకాలపై చట్టపరమైన చర్యలు

**శామీర్‌పేట్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** దేవర యాంజల్లో అక్రమ నిర్మాణాలు, మట్టి తవ్వకాలపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించి జేసీబీ, లారీ సీజ్ చేశారు. శామీర్ పేట్ తహశీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలతో దేవరయాంజల్ గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మండల గిర్దావర్ భాను చందర్, గ్రామ పాలనా అధికారి రమ తమ క్షేత్రస్థాయి సిబ్బంది తో కలిసి రంగంలోకి దిగి అక్రమ పనులను నిలిపి వేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 684, 685 లలో కొందరు వ్యక్తులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గమనించిన అధికారులు, వెంటనే సిబ్బందితో కలిసి ఆ ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. సర్వే నంబర్ 676లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టిని తెచ్చి గుమ్మరిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన గిర్దావర్ భాను చందర్, గ్రామ పాలనా అధికారి రమ ఘటనా స్థలంలో ఉన్న ఒక జేసీబీ, ఒక లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలకు, మట్టి రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
28 అక్టోబర్ 2026

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి
- ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాస్



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాస్ పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్జీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రదాస్, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్, ఎస్ఐఆర్ ప్రక్రియ కోఆర్డినేటర్ శత్రురావు బుజ్జి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్ఠాత్మకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో కనీసం 500 మంది పట్టభద్రులను, మున్సిపాలిటీల పరిధిలో కనీసం 1,000 మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని శివసేన రెడ్డి సూచించారు. ఓటరు జాబితాలను పరిశీలిస్తూ అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో--దేశ్ బచావో' మహాధర్నాలో తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు చేపట్టే ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వానికి మద్దతుగా నిలుస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పార్టీ నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నేతలు సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి క్షేత్రస్థాయి నుంచే పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంకిని వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్లు మధుసూదన్ గౌడ్, సుమిత్ర ఎల్లారెడ్డి, టౌన్ అధ్యక్షుడు కదిరే రాములు, మండల అధ్యక్షుడు రవికిరణ్, మున్సిపల్ కౌన్సిలర్ మహేశ్వరి, జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యశీలా రెడ్డి, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు నరహరి, రేవల్లి మండల అధ్యక్షుడు సుల్తాన్, ఏదుల మండల అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, పెద్దమందడి మండల అధ్యక్షుడు వెంకటస్వామి, గణపురం మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్, మన్యం, యాదగిరి వాల్మీకి, సర్పంచులు రాములు, వాలియా నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్, శివకుమార్ నాయుడు, ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీకాంత్, రోహిత్, వివిధ మండలాల, పట్టణాల బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫామ్ పాండ్ పనులు వేగవంతం చేయాలి

- నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**వనపర్తి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** విబిజి రామ్ జీ పథకం కింద జిల్లాలో చేపట్టిన ఫామ్ పాండ్ (నీటి కుంటల) నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో చేపట్టిన ఫామ్ పాండ్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసేందుకు కూలీల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన సంఖ్యలో కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఉమాదేవి, ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

- ప్రభుత్వం స్పందించకపోతే లక్ష మందితో హైదరాబాద్‌లో భారీ నిరసన
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రాష్ట్ర రాజధాని లో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన.. రాష్ట్ర స్థాయి గౌరవ వేతన సాధన సభ, రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల రాత్రి కీలకమైనది అన్నారు. క్షేత్రస్థాయిలో డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లక్ష మందితో కలిసి రాష్ట్ర రాజధానిలో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు, సంఘం ప్రతినిధులు, రేషన్ డీలర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ సమగ్ర సర్వేలో వేగం పెంచాలి

- రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూ సమగ్ర సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్నంబావి మండలంలో పర్యటించిన ఆయన చెల్లెపాడు గ్రామంలో జరుగుతున్న భూ సమగ్ర సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. అనంతరం చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ రెవెన్యూ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో గ్రామస్తులు, రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి భూముల సర్వే సమయంలో తప్పనిసరిగా హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో భూ భారతి, సదాబైనామా కింద అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. భూదాన్ భూములకు సంబంధించిన వివరాలను భూ భారతి పోర్టల్‌లో వెంటనే నమోదు చేసి, భూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి, జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫారం-18 ద్వారా అందిన దరఖాస్తుల విచారణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



**వనపర్తి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఈ నెల 31వ తేదీలోగా అత్యధిక దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో వెబ్‌ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయకుండా ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని ఆదేశించారు. సంబంధిత భూముల రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వివరాల నమోదును త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, వివిధ మండలాల్లో గ్రామ పంచాయతీ (జీపీ) భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అందిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి, వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్ రెడ్డి, ఏఓ భాను ప్రకాష్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల త్యాగం వెలకట్టలేనివి

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 27 (జనం సాక్షి) :** పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనివని, పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం అక్టోబర్ 21 ను పురస్కరించుకొని ఫ్లాగ్ డే ఈవెంట్స్‌లో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్, బీచుపల్లి 10 వ బెటాలియన్ పోలీస్ సంయుక్తంగా నిర్వహించిన, బైక్ ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద, జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ లో భాగంగా జిల్లా ఎస్పీ కూడా స్వయంగా బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రజలతో మరింత మమేకం అవుతూ, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రం లోని జిల్లా పోలీస్ కార్యాలయం నుండి మొదలైన ర్యాలీ కలెక్టరేట్, ఫ్లైఓవర్, రాజీవ్ మార్గ్, వైయస్సార్ చౌక్, న్యూ బస్ స్టాండ్, కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్, ఫ్లైఓవర్ మీదుగా తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు నిర్వహించారు. 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ బైక్ ర్యాలీలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్, బీచుపల్లి 10 వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఆదినారాయణ, డి. ఎస్పీ మొగిలయ్య, సాయుధ దళ. డి.ఎస్పీ నరేందర్ రావు, అసిస్టెంట్ కమాండెంట్ లు వెంకట రమణ, పార్థ సారథి రెడ్డి, గద్వాల్ సి.ఐ. టంగాటూరి శ్రీను, అలంపూర్ సి.ఐ.ప్రదీప్, ఆర్.ఐ. లు వెంకటేష్, నరేష్, హరీఫ్, బెటాలియన్ ఆర్.ఐ. లు రాజేశం, తిరుపతి, శ్రీనివాస్, నరసింహ రాజు జిల్లా పోలీస్ సిబ్బంది, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భద్రత పోలీసుల లక్ష్యం

- తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్

**తూప్రాన్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం అని తూప్రాన్ డిఎస్పి నరేంద్ర గౌడ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, పోలీసుల త్యాగాలు , పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం నిర్వహించారు ముఖ్య అతిథిగా తూప్రాన్ సబ్ డివిజన్ డీఎస్పీ నరేంద్ర గౌడ్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలకు , ఆస్తులకు రక్షణ కల్పించడం, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. విధి నిర్వహణలో భాగంగా దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన పోలీస్ అధికారులు వివిధ రకాల పోలీస్ ఆయుధాలు, వాటి వినియోగం, పనితీరు మరియు విధి నిర్వహణలో వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్ శాఖలో ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, వాటి భద్రతా నియమాలు మరియు పోలీసుల విధుల గురించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో , తూప్రాన్ టౌన్ ఎస్ఐ గంగరాజు, ఎస్ఐ జ్యోతి, ఎస్ఐ యాదగిరి, ఎస్ఐ మధుసూదన్ రావు, ఏఆర్ఎస్ఐ భవానీ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# భూభారతి డిజిటల్ సర్వేకు రైతులు సహకరించాలి

**బాలానగర్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** బాలానగర్ మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో మంగళవారం భూభారతి డిజిటల్ సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రైతులకు డిజిటల్ సర్వే విధానం, భూముల వివరాల నమోదు, సర్వే ప్రక్రియకు సంబంధించిన అంశాలను వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, సర్వే సమయంలో అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని తహసీల్దార్ సూచించారు. అప్పాజీపల్లి గ్రామంలో 683.05 ఎకరాలు, శేరిగూడలో 373.36 ఎకరాల భూమికి డిజిటల్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. భూముల వివరాలు పక్కాగా నమోదు కావడానికి రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అప్పాజీపల్లి గ్రామ సర్పంచ్ కేతావత్ వెంకటేష్ నాయక్, ఆర్ఐ ఇనాయత్ అలీ, సర్వేయర్ జుబేర్, ఇతర అధికారులు, అప్పాజీపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# డిసెంబర్ నెలాఖరులోగా 550 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న 550 పడకల ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ఇంకా ఎలాంటి పనులు చేపట్టాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను రానున్న డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన నమూనా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతతో పాటు పనుల ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయడమే కాకుండా, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రి నిర్మాణం నాణ్యతతో ఉండాలని సూచించారు. నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటి పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను సకాలంలో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేలా బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సులేమాన్, ఇంజనీరింగ్ అధికారి సుధాకర్ రెడ్డి, ఇతర మెడికల్ కళాశాల అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద
# రూ.10 లక్షలు కేటాయింపు

- వరంగల్ డీసీసీబీ మహాజనసభ సమావేశం
- జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్-ఇన్-ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజనసభ సమావేశం హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, బ్యాంకు పర్సన్–ఇన్–ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు బ్యాంకు డి ఆర్ ఓ ఎస్ డి వెంకటేశ్వర్లు, జిఎం ఉషాశ్రీ, ఇతర బ్యాంకు అధికారులు పిఎసిఎస్, అధ్యక్షులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ సర్టిఫికేషన్, వార్షిక ఆర్థిక నివేదికలు, బ్యాలెన్స్ షీట్, లాభనష్టాల ఖాతా, నికర లాభాల వినియోగం ఆడిటర్ల నియామకం వంటి అంశాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ 50% కంటే ఎక్కువ రికవరీ సాధించిన అర్హతగల సొసైటీలకు రూ.50 లక్షల వరకు, మిగిలిన ఏ బి కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సొసైటీలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల సదుపాయం కల్పించే అంశాన్ని వెల్లడించారు. రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించేందుకు వన్‌టైమ్ సెటిల్ మెంట్ పథకాన్ని 31 మార్చి 2027 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ డిసిఓ మోహన్. సీఈవో మహ్మద్ వజీర్ సుల్తాన్ వరంగల్ డిసిఓ నిరజ, నాబార్డ్ డిడిఎం చంద్రశేఖర్, భూపాలపల్లి డిసిఓ వల్యా నాయక్, మహబూబాబాద్ డీసీఓ సర్దార్ సింగ్ పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి వసతులపై ప్రత్యేక కార్యాచరణ
- ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలి
- క్షేత్రస్థాయి పర్యవేక్షణతో నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి) :** ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థల పరిస్థితిని ఆవాసాల వారీగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో సన్నద్ధత, తాగునీటి వసతులు, జలసిరి పనులు, ఉపాధి కూలీల హాజరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనిదినాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో తాగునీటి సరఫరా మౌలిక వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రిడ్ ద్వారా ఆవాసాలు, పట్టణ ప్రాంతాలకు అందుతున్న శుద్ధి చేసిన నీటి సరఫరాతోపాటు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు చేరుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణకు ముందుగా నవంబర్ రెండో వారంలోగా మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇంట్రా, గ్రిడ్ ఏఈలు, ఏఈఈలు, ఎంపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి, రోజువారీ పర్యటనల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లు, స్లూయిస్ వాల్వుల వద్ద లీకేజీలను అరికట్టాలని సూచించారు. ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులను నిర్ణీత తేదీల్లో శుభ్రపరచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ట్యాంకుల మ్యాన్‌హోల్ మూతలు, కీటకాలు ప్రవేశించకుండా ఉండే వెంటిలేటర్ల జాలీలు, మెట్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. నీటి శుద్ధికి క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ వినియోగిస్తూ, సరఫరా చివరి ప్రాంతంలో అవశేష క్లోరిన్ స్థాయిని పరీక్షించాలని సూచించారు. అవసరమైన బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఇంటి నల్లా కనెక్షన్ పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచడంతోపాటు నిర్వహణ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు తగ్గడం, స్థానిక నీటి వనరులు ఎండిపోవడం, తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ఆవాసాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. నీటి కుంటలు, ఇందిరా జలప్రభ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు ట్యాంకులు తదితర పనులకు అంచనాల సమర్పణ నుంచి అనుమతుల మంజూరు వరకు ప్రతి దశను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సిబ్బంది సహకారంతో ఈ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయించే బాధ్యత ఎంపీడీఓలదేనని స్పష్టం చేశారు. అధికారులు ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు, సిబ్బంది విధులను పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పంచాయతీల వారీగా లక్ష్యాలు కేటాయించాలని, తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి చూపాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓలు కూడా తమ మండల పనులపై పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంతకాల ఫోర్జరీ వంటి తీవ్రమైన ఆరోపణలను సాధారణ పొరపాట్లుగా పరిగణించరాదని స్పష్టం చేశారు. సిబ్బంది తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని సహించబోమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి ఆర్ డి ఓ రవీందర్, డి పి ఓ వెంకయ్య, ఆర్ డబ్ల్యూఎస్ సునీత, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సిద్ధి విత్తనాలతో నష్టపోయాం

- 15 రోజులు దాటిన పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- రాంపూర్ దుంపలగూడెం రైతుల ఆవేదన



**గోవిందరావుపేట, అక్టోబర్27 (జనంసాక్షి):** నకిలీ సిద్ధివిత్తనాలతో తాము నష్టపోయామని, తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రాంపూర్ దుంపలగూడెం గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం రైతులు మరో మారు తమ పొలాల వద్ద వరి మొక్కలను పీకి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇతర కంపెనీల సిద్ధి 44 విత్తనాలు కోతకు వచ్చాయనిఇ, మంగళ సీడ్స్ రాంపూర్ వారు ఇచ్చిన విత్తనాలు ఇప్పటివరకు పొట్ట దశకు కూడా రాలేదని, 15 రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ కార్యాలయం, ప్రజావాణి, పోలీస్ స్టేషన్లలో మంగళ సీడ్స్ కంపెనీ యాజమాన్యంపై ఫిర్యాదు చేశామని, ఇప్పటివరకు స్పందన లేదని తెలిపారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే ఈ ప్రభుత్వం రైతులు 20 రోజులుగా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం ఎంతవరకు సమంజసమని అంటున్నారు. ఇప్పటివరకు కంపెనీ యాజమాన్యం అధికారులతో మాట్లాడుతున్నారు తప్ప ఫీల్డ్ మీదికి రావడం గానీ, మిగిలిన విత్తనాలను పరీక్షించడం గానీ ఇతర సిద్ధి కంపెనీ ఫీల్డ్లను పరీక్షించడం గానీ జరగడం లేదని, తమది అరణ్య రోదనగానే మిగిలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారం రోజుల లోపే మంగళ సీడ్స్ యాజమాన్యం వస్తుందని చెప్పిన అధికారులు ఇప్పటివరకు దాటవేస్తూ వస్తున్నారని తప్ప యాజమాన్యంపై చర్యలు చేపట్టడం లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యాజమాన్యాన్ని పిలిపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని, లేకపోతే రైతులు రాస్తారోకో చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బద్దం వేంకన్నా, బానోత్ జూముకు ,సమ్మయ్య, శేఖర్, తరుణ్, స్వామి ,చందు, స్వరూప, వెంకటరెడ్డి ,అనిల్, హీరూ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈనెల నెలాఖరు న శాస్త్రవేత్తలు పరిశీలిస్తామన్నారు. స్థానిక వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి మంగళ సీడ్స్ ఇచ్చిన సిద్ధి వ్యవసాయ క్షేత్రాలను ఈ నెలాఖరున వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించనున్నట్లు తెలిపారు. బాధిత రైతులు కలెక్టర్కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శాస్త్రవేత్తలు పరిశీలన కొరకు రానున్నారని పేర్కొన్నారు.

# ఓటు బచావో - దేశ్ బచావో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అర్హులైన ప్రతి ఓటరు హక్కును కాపాడాలి..
- బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి..
- గ్రామసభల ద్వారా అవగాహన కల్పించాలి..
- ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమష్టిగా కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు పిలుపునిచ్చారు. 'ఓటు బచావో – దేశ్ బచావో' ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, డివిజన్ల స్థాయిలో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలకు) స్పష్టమైన సూచనలు ఇవ్వాలని కేబీఆర్ నాయుడు తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, గతంలో ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికీ ప్రస్తుతం జాబితాలో పేరు కనిపించని వారి వివరాలను సేకరించాలని సూచించారు ఇంటింటి పరిశీలన ద్వారా జాబితాలో పేర్లు లేనివారు, పేర్లలో తప్పులు ఉన్నవారు, పొరపాటున మరణించినవారిగా నమోదు చేసినవారు, ఇతర ప్రాంతాలకు మారినట్లు తప్పుగా చూపినవారి వివరాలను వాస్తవ పరిస్థితులతో సరిపోల్చాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్ల నమోదు, వివరాల సవరణకు సంబంధిత ఫారాల ద్వారా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా సహకరించాలని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ఎన్నికల్లో ఓటు వేయడానికి మాత్రమే పరిమితం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ణయించే కీలకమైన హక్కు అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల పేర్ల నమోదు, తప్పుల సవరణతోపాటు అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, అసెంబ్లీ కోఆర్డినేటర్ సిరాజ్ హుస్సేన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మార్క విజయ్ కుమార్, దాట్ల శ్రీనివాస్, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కౌన్సిలర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.



# రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలి

- రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తొలుత సరైన అంచనాలు రూపొందించకపోవడంతో నిర్మాణ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని విమర్శించారు. సవరించిన అంచనాల ప్రకారం పెరిగిన వ్యయానికి తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పనులను వేగవంతం చేసి, ఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

- రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ
- స్వయంగా రక్తదానం చేసిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనం సాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారం శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిభిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ జిల్లా పాలక మండలి సభ్యులు కె.రాకేష్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?

- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




**తొర్రూరు, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎన్నో హామీలు అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో మాత్రం నిర్లక్ష్యమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆయా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల ప్రయోజనాలు అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆశలను నీరుగార్చకుండా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, పేద కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకాలని ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# జాతీయ వూషూ పోటీలకు ఎంపిక

- క్రీడాకారులకు కలెక్టర్ అభినందన
- ఖేలో ఇండియా క్రీడాకారులకు క్రీడా కిట్ల పంపిణీ

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** రాష్ట్రస్థాయి వూషూ పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నిర్మల్ జిల్లా క్రీడాకారులను కలెక్టర్ భవేశ్ మిశ్రా అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం విద్యార్థులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మంచిర్యాలలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వూషూ పోటీల్లో మృణాళిని రెండు పతకాలు (బంగారు, రజతం), జ్ఞానతేజ బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు డిసెంబర్ 9 నుంచి 15 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. అలాగే చెన్నైలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో గోర అనన్య, నార్వాడే ఆయుష్, సల్ల రామ్ చరణ్ పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఖేలో ఇండియా వూషూ శిక్షకుడు శ్రీరాముల సాయికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# హనుమకొండ, వరంగల్ జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలి

- రైతుల పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలి
- కలెక్టర్లకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి, సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు పంటలు చేతికి రాక ఆర్థిక సంక్షోభం ఎదురవుతోందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి ఆదుకోవాలని కోరుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాలను కరువు ప్రభావిత జిల్లాలుగా ప్రకటించి, రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావంతో నష్టపోయిన పంటలకు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి తగిన నష్టపరిహారం అందించాలని, అర్హులైన రైతులకు పంటల బీమా పరిహారం చెల్లించాలని కోరారు. సాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా నాయకులు సుకినే సుధాకర్ చౌల రామారావు అంబిరి శ్రీనివాస్ బిక్షపతి మాధవరావు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాబోధన, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతులలో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం సకాలంలో అందించాలని, పాఠశాలలలో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**బీబీనగర్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించలన్నారు.రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి

- **మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** రాబోయే పట్టభద్రుల ఎమ్ఎల్సి ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలో ముస్తఫా నగర్,గాంధీ చౌక్, జిల్లా కోర్ట్, ఎస్ఆర్ కాలేజ్ వద్ద నిర్వహించిన ఓటర్ల నమోదు కేంద్రాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తక్కేళ్లపల్లి రవీందర్ రావు సందర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్ఎల్సి ఎన్నికల నియమాల ప్రకారం గతంలో ఓటు ఉన్నవారు కూడా ఈసారి తప్పనిసరిగా కొత్తగా ఓటు నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఓటు ఉందనే ధీమాతో ఉండకుండా ప్రతీ పట్టభద్రుడి చేత మళ్లీ దరఖాస్తు పూర్తి చేయించాలని సూచించారు. గత ఎన్నికల డేటా ఆధారంగా డివిజన్ల వారీగా, ఇంటి నంబర్ల వారీగా పట్టభద్రులను గుర్తించి వారికి ఫోన్లు చేసి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ విభాగాలకు బాధ్యతలు అప్పగించారు. ఫోన్ల ద్వారా అందుబాటులోకి రానివారి ఇళ్లకు నేరుగా వెళ్లి చివరి



ప్రయత్నంగా ఓటు నమోదు చేయించాలని కోరారు.పట్టభద్రుల ఎన్నికల్లో లీగల్ సెల్ పాత్ర ఎంతో కీలకమని లీగల్ సెల్ ఓటు ఎన్రోల్మెంట్ కేంద్రం వద్ద న్యాయవాదులు ప్రతి ఒక్కరిని నమోదు చేయించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు మరియు నివాస ప్రాంతాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతిఒక్కరి ఓటు నమోదు చేయాలన్నారు. గత మూడేళ్లలో పట్టభద్రులైన నూతన అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఓటర్ల నమోదుకు కేవలం 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున ప్రతీ కార్యకర్త రోజువారీ లక్ష్యాన్ని పెట్టుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. సభలు, మైకులు పెట్టి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే ఇటువంటి గ్రౌండ్ లెవల్ (క్షేత్రస్థాయి) వర్క్ మాత్రమే ఎన్నికలలో పార్టీ విజయానికి ఉపయోగపడుతుందని అన్నారు.ఖమ్మం నగర పరిధిలోని అన్ని డివిజన్లలో నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత డివిజన్ సమన్వయకర్తలు, బాధ్యులతో స్వయంగా మాట్లాడి ఏ డివిజన్‌లో ఎంత నమోదు జరిగిందో సమీక్షిస్తానని తెలిపారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు రాబోయే రోజుల్లో స్వయంగా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ గారి పిలుపు మేరకు నాయకులందరూ క్రియాశీలకంగా పాల్గొని పట్టభద్రుల ఓటర్ల నమోదును జయప్రదం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో నాయకులు =జీజ కృష్ణ,బచ్చు విజయ్ కుమార్,పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ,షేక్ మక్బుల్, పల్లా రోజలీనా,నాగండ్ల కోటేశ్వరరావు,బిక్కసాని జస్వంత్,పసుమర్తి రామ్మోహన్,మాటేటి నాగేశ్వరరావు,బత్తుల మురళి,మెంతుల శ్రీశైలం, లీగల్ సెల్ బిచ్చాల తిరుమల్ రావు,కొత్త వెంకటేశ్వర్రావు,మేకల సుగుణ రావు,శేషు, రామ్మూర్తి,బోజెండ్ల రామ్మోహన్,పాలడుగు పాపారావు,కనకం భద్రయ్య, పాషా,షకీనా,మాటేటి కిరణ్,మోరంపూడి సాయి,సురేష్, గోపి,తౌసిఫ్,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- **కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి**
- **బీఆర్ఎస్‌ను గెలిపించాలి**
- **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**హాలియా, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హాలియాలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 9 వేలకుపైగా పట్టభద్రుల ఓట్లు నమోదయ్యాయని, మరో 6 వేల ఓట్లు నమోదు కావాల్సి ఉందని తెలిపారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2006 నుంచి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఒక్క ఓటు తేడాతో ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి,



బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కొత్త పథకాలు అమలు చేయడం పక్కనపెట్టి, గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కూడా కొనసాగించలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తీసుకొస్తామని చెప్పిందని, ప్రస్తుతం విద్యుత్, తాగునీరు వంటి కనీస అవసరాలు తీర్చడంలో విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులకు హామీలు ఇచ్చిన రాహుల్‌గాంధీని, అదే నిరుద్యోగులు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారని అన్నారు. నాగార్జునసాగర్ చరిత్రలో 17 పంటలకు నీరందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. సాగర్ ప్రాజెక్టు సమీపంలో ఉన్న నందికొండకు గతంలో తాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజల కోరిక మేరకు నందికొండకు తాగునీరు అందించడంతోపాటు, సాగర్‌ను మున్సిపాలిటీగా చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీటి రంగంలో కీలక మార్పులు తీసుకొచ్చామని, ప్రస్తుతం నాగార్జునసాగర్ నీటి కోసం మళ్లీ ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు కమీషన్ల కోసమే పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన కొనసాగిస్తున్నారని విమర్శిస్తూ, మరో రెండేళ్లు ఓపిక పట్టాలని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ ట్రైకార్ ఛైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, ఏనుగుల రాకేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్, రిక్కల ఇంద్రసేనారెడ్డి, బాబూరావు నాయక్‌తోపాటు నియోజకవర్గ నాయకులు, పట్టభద్రులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## జనంసాక్షి వార్తకు స్పందన

- **అక్రమంగా చెట్లు నరికిన వారికి గ్రామపంచాయతీ నోటీసులు**




**మాడుగులపల్లి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** మాడుగులపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న పచ్చని చెట్లను అక్రమంగా నరికివేస్తున్నారంటూ అక్టోబర్ 25న జనం సాక్షి దినపత్రికలో పచ్చదనంపై ప్రతాపం పర్యావరణం గాలికి!అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్థానిక అధికారులు వెంటనే స్పందించారు. వార్త కథనంపై స్పందించిన స్థానిక పంచాయతీ కార్యదర్శి (సెక్రెటరీ) పాలకవర్గం వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికి కట్టెలు కొట్టించిన బాధ్యులను గుర్తించారు పర్యావరణానికి హాని కలిగిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లను తొలగించినందుకు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామపంచాయతీ తరపున వెంటనే నోటీసులు జారీ చేశారు

గ్రామపంచాయతీ నోటీసుల ఆధారంగా స్పందించిన మండల స్థాయి అధికారులు (ఎంపీడీఓ, తహసీల్దార్ సంబంధిత ఫారెస్ట్ అధికారులు) విచారణ చేపట్టాలీ పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం అక్రమంగా చెట్లు నరికిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు ఇకపై మండల పరిధిలో ఎవరైనా ముందస్తు అనుమతులు లేకుండా రోడ్డు పక్కన గానీ, ప్రభుత్వ స్థలాలలో గానీ ఉన్న చెట్లను నరికివేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానాలు విధిస్తామని మండల అధికారులు హెచ్చరించారు పత్రికల్లో వచ్చిన కథనం ద్వారా అధికారులు త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విధి నిర్వహణలో ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

- **తీవ్ర గాయాలు**
- **హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రవల్లికను పరామర్శించిన ఆర్ఎం సరి రామ్**



**ఖమ్మం, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఆర్టీసీ బస్సులో విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలు దాడికి తెగబడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవల్లిక ఆదివారం ఉదయం విధుల్లో ఉండగా, ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం చెలరేగింది. మాటామాటా పెరగడంతో సదరు ప్రయాణికురాలు విచక్షణ కోల్పోయి కండక్టర్‌పై దాడి చేసి, నడుస్తున్న బస్సులో నుంచి బయటకు నెట్టివేసింది. ఈ ప్రమాదంలో కిందపడిన ప్రవల్లిక కాలుపై తీవ్ర గాయాలయ్యాయి. ఎముకలు విరిగి పరిస్థితి విషమంగా మారింది. విషయం తెలుసుకున్న ఖమ్మం రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) సరి రామ్ వెంటనే స్పందించారు. క్షతగాత్రురాలికి స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం నిమిత్తం హుటాహుటిన హైదరాబాద్‌లోని సాయి సంజీవిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఆర్ఎం సరి రామ్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి ప్రవల్లికను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సంస్థ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని బాధితురాలికి భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తూ నిత్యం సేవలందించే ఆర్టీసీ సిబ్బందిపై ఇలాంటి దాడులు జరగడం పట్ల కార్మిక సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

## జనగణనలో తప్పులు దొర్లకుండా నిర్వహించాలి

- **జనగణనలో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి**
- **జనగణనలో 40 రకాల వివరాల సేకరణ**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జనగణనపై జరిగిన జిల్లా,డివిజనల్ స్థాయి అధికారులు,చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్ల శిక్షణా తరగతుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.జనగణన రెండో దశ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు, అధికారుల బాధ్యతల గురించి వివరించారు.జన గణన రెండో దశను 2027 జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.స్వీయ గణన 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు, జన గణన 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.2027 ఫిబ్రవరి 28న ఇళ్లు లేని వారిని గణించడం జరుగుతుందని, రివిజనల్ రౌండ్ 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.జనగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం 40 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి జనాభా గణన విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.జనాభా గణన ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈవో శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విస్తా కాంప్లెక్స్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

- **ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కోరిన చిరు వ్యాపారులు.**

**భద్రాచలం, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానానికి చెందిన విస్తా కాంప్లెక్స్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కలిసి తమ సమస్యలను వివరించి, నిర్మాణ పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పూనేం కృష్ణ, మొదటి వార్డు సభ్యుడు చెంచు సుబ్బారావు, రెండో వార్డు సభ్యుడు బొంత రమణ ఆధ్వర్యంలో వ్యాపారులు ఎమ్మెల్యేను కలిశారు. విస్తా కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి, అప్పటివరకు ఉన్న దుకాణాలను ఖాళీ చేయించి పాత భవనాన్ని కూల్చివేశారని తెలిపారు. అయితే, ఇప్పటివరకు కొత్త కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో తాము ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకునే తాము, వ్యాపార సముదాయం అందుబాటులో లేకపోవడంతో జీవనోపాధికి దూరమయ్యామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం తమ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిరు వ్యాపారుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సంబంధిత అధికారులతో మాట్లాడి, విస్తా కాంప్లెక్స్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో తమకు త్వరలో ఉపాధి లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యాపారులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విస్తా కాంప్లెక్స్ చిరు వ్యాపారులు తేజ, శ్రీకాంత్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.



## ధంసలాపురం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 27 (జనం సాక్షి) : స్థానిక ధంసలాపురం చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క మొక్కలను ప్రత్యేక యంత్రం ద్వారా తొలగింపును జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, చెరువులో నీటి ఉపరితలంపై పెద్దఎత్తున విస్తరించిన గుర్రపుడెక్క, ఇతర జలకలుపు మొక్కలను తొలగించేందుకు అక్వాటిక్ వీడ్ హార్వెస్టర్ అనే ప్రత్యేక యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ వేగవంతంగా సాగడంతో పాటు, మానవ శ్రమ కూడా తగ్గుతుందని తెలిపారు. చెరువుల్లో గుర్రపుడెక్క అధికంగా విస్తరించడం వల్ల నీటి ఉపరితలంపై సూర్యరశ్మి ప్రసరణ తగ్గుతుందని, నీటిలో ఆక్సిజన్ స్థాయులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించడం ద్వారా నీటి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, జలవనరులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, గుర్రపుడెక్క తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఏ. మల్లేశం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరిసాగుకు బదులుగా ఆరుతడి పంటలు వేయాలి

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులు, మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని, అధికారులు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండవ పంట సాగు చేస్తే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

### యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ



శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు 2 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 28.10.2026



# రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..

**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మంగళవారం గోదావరిఖని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి రైతుకు పరిస్థితులను అర్థమయ్యేలా వివరించి, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, చెరువులు, కుంటలను సంరక్షించడం, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి 4.5 టీఎంసీల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎల్‌నినోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను తిప్పికొడుతూ, ప్రకృతి సంబంధిత పరిస్థి తులను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించకూడదని అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎలాంటి నష్టం కలగకుండా రైతులకు, ప్రజలకు అండగా నిలిచే బాధ్యతను తాము తీసుకుంటామని, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణా రావుతో కలిసి అవసరమైన చర్యలకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. రామగుండం నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రాధాన్యం ఇస్తూ ఒక్కో గ్రామానికి సుమారు 130 ఇళ్ల వరకు మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణంతో పాటు పంచాయతీరాజ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల సొమ్మేనని, నిధులు ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకే వినియోగించేలా పర్యవేక్షించాలని కోరారు. ప్రజల సంక్షేమం, రైతుల భద్రత, గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం. ప్రతి గ్రామానికి రాజ్ ఠాకూర్ వస్తాడు.. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తాడు అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు కేటీఆర్ పరామర్శ

**ముస్తాబాద్ అక్టోబర్ 27(జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్క రాజు శ్రీనివాసును సిరిసిల్ల ఎమ్మెల్యే తారక రామారావు తోపాటు, కొండూరి రవీందర్రావు, తుల ఉమా,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అక్కరాజు శ్రీనివాసును పరామర్శించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని అక్క రాజు శ్రీనివాసుకు సూచించినట్లు తెలిపారు.



# ప్రతీ పనికి ఓ రేటు..!

## అడ్డగోలుగా డబ్బుల డిమాండ్ దందా

- ఇల్లు కట్టలాన్న, ధృవీకరణ పత్రాలు కావాలన్నా కాసులివ్వాల్సిందే..
- కోర్టు ఆదేశాలు దిక్కరిస్తున్న కామారెడ్డి మున్సిపల్ కోర్టు నోటీసు చెల్లదని కరాఖండిగా చెప్పేసిన టౌన్ ప్లానింగ్ అధికారి
- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా...



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనంసాక్షి):** కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే కాకుండా బెకతర్ చేస్తూ ఈ నోటీసులు చెల్లవని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. దీంతో బాధితులు కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీ తో మున్సిపల్ ముందు మంగళవారం నిరసన కార్యక్రమం చేస్తూ ధర్నా నిర్వహించడం జరిగింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో అక్రమ వసూళ్ల ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు చేతివాటం చూపుతూ డబ్బులు దండిగా దండుకుంటున్నారని బాధితులు వాదన. అంతేకాకుండా కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీ కూడా చెల్లదనంతో అత్యున్నత జిల్లా న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కూడా చెల్లదని టౌన్ ప్లానింగ్ అధికారి వినీత్ కుండబద్దలు కొట్టినట్టు తెలిపారు. అంతేకాకుండా మధ్యవర్తిగా ఇల్లు నిర్మిస్తున్న వారి వద్దకు వెళ్లి మేము మున్సిపల్ నుంచి వచ్చాము మీరేమైనా ఉంటే మున్సిపల్ కి వచ్చి మాట్లాడుకోండి అని మున్సిపల్ అధికారుల మంది పేరు చెప్పుకొని ప్రశాంత్ అని వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్న ఇంటి యజమానికి ఏమైనా ఉంటే కమిషనర్ తో మాట్లాడుకోమని చెప్పి వెళ్ళాడు. దీంతో ఇంటి యజమాని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ప్రశాంత్ కలవగా కమిషనర్ కు ఎన్నో కొన్ని డబ్బులు ఇచ్చి పర్మిషన్ తీసుకోండి మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని హితబోధ చేశారు. ఇది కమిషనర్ చెప్పినాడని ముందస్తుగా మీకు చెప్తున్నాను అని ఇది ఫోన్లే చెప్పచ్చు కానీ ఇక్కడ వరకు పిలిచి రహస్యంగా జరగాలని ఇలా చెప్పమని కమిషనర్ పర్వతాలు ప్రశాంత్ తెలిపారు. ఇల్లు నిర్మించాలన్న మరణ ధృవీకరణ పత్రం కావాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందేనా అన్న పరిస్థితి నెలకొంది. ప్రజలకు అందించాల్సిన ప్రభుత్వ సేవలు కొందరికి భారంగా మారుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో పనులు చేయించుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందా...? ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు పొందాలన్నా, కుటుంబ సభ్యుల మరణ ధృవీకరణ పత్రం తీసుకో వాలన్నా డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

**పనుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు..**

సామాన్య ప్రజలు తమ అవసరాల కోసం మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే నిబంధనల ప్రకారం సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే కొన్ని పనుల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మరణ ధృవీకరణ పత్రాలు వంటి కీలకమైన సేవల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రుసుములకు అదనంగా డబ్బులు అడుగుతున్నారా? అలా అడుగుతున్నట్లయితే దాని వెనుక ఎవరున్నారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన..**

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధితులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగినట్లు సమాచారం. ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం, అదనపు డబ్బుల డిమాండ్ వంటి ఆరోపణలపై అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. కోర్టు ఆదేశాలకు సంబంధించిన అంశాలపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు స్పందించి విచారణ చేపట్టాలి..**

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. బాధితులు చేస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజ లు కోరుతున్నారు. అక్రమ వసూళ్లు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రజలకు నిర్ణీత గడువులో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై వినతిపత్రం అందించడానికి వెళ్లగా అందుబాటులో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎవరు కూడా అందుబాటులో లేని దుర్భర పరిస్థితి నెలకొంది.

# బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి :మంత్రి సీతక్క.

- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు
- మంత్రి సీతక్క దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లిన కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్



**భీంగల్(జనంసాక్షి):** బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ ప్రజానిలయానికి విచ్చేసిన మంత్రి సీతక్కకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ఇప్పటికే కొనసాగుతున్న పనుల పురోగతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముత్యాల సునీల్ కుమార్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క సంబంధిత అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ కాలనీ సమస్యలపై మంత్రి ప్రత్యేక దృష్టి. అనంతరం వేల్పూర్ మండలంలోని ఇందిరమ్మ కాలనీని మంత్రి సీతక్క సందర్శించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానిక నాయకులు, ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ... బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. మంత్రి సీతక్క సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి పనులకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్యంపాలెం నర్సయ్య, మండల ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్ధన్, మోర్తాడ్, ఏర్గట్ల, వేల్పూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ సర్పంచుల ఫోరం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- రెండు వారాల్లో రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లను తరలించాలి..
- రామగుండంలో మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు నిర్మాణ పనుల పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష

అంతర్గాం,జనంసాక్షి :రామగుండంలో మసీదు చౌరస్తా నుంచి లింగాపూర్ రోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లను రెండు వారాల్లో తరలించాలని ×జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష× సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండంలోని మసీదు చౌరస్తా వద్ద జయగుతున్న రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ జెన్‌కో స్తంభాలు, డిస్కం విద్యుత్ స్తంభాల తరలింపు పనులను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా పనులను సమన్వయంతో చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ జాతీయ సదస్సులో పాల్గొన్న పారమిత విద్యాసంస్థల ప్రతినిధులు

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద రావు




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 27 ( జనంసాక్షి):** న్యూఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో అక్టోబర్ 26, 27 తేదీల్లో నిర్వహించిన నాల్గవ సీబీఎస్ఈ జాతీయ సదస్సులో "విద్యార్థులను కేవలం మార్కుల సాధనకే పరిమితం చేయకుండా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా జీవన నైపుణ్యాలను పెంపొందించాలని" విద్యావేత్తలు సూచించారు. ఈ సదస్సుకు పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ కె.హన్మంతరావు, ప్రిన్సిపాళ్లు పి.గోపీకృష్ణ, యం.శ్రీకర్ లు హాజరయ్యారు. 'ఫెసిలిటేటింగ్ స్కూల్స్ టు వర్క్ ట్రాన్సిషన్' (పాఠశాల విద్య నుంచి ఉపాధి వైపు పయనం) అనే ప్రధాన ఇతివృత్తంతో రెండు రోజులపాటు సదస్సు నిర్వహించారు. జాతీయ విద్యా విధానం-2020 అమలు, నైపుణ్యాధారిత విద్య, విద్యార్థులను ఉపాధికి సిద్ధం చేయడంలో పాఠశాలల పాత్ర తదితర అంశాలపై నిపుణులు చర్చించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమస్యల పరిష్కార సామర్థ్యం, కమ్యూనికేషన్, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారిని సమర్థవంతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. సదస్సులో చర్చించిన విద్యా విధానాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పారమిత విద్యాసంస్థల్లో గత 15 ఏళ్లుగా అమలు చేస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతోపాటు ఆచరణాత్మక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. సీబీఎస్ఈ సూచిస్తున్న నూతన విద్యా విధానాలు, నైపుణ్యాధారిత అభ్యసన పద్ధతులపై జరిగిన చర్చలు తమకు మరింత ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ జాతీయ సదస్సులో కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి టి. అనిల్ కుమార్, నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరం, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ చైర్మన్ అనిల్ సహస్రబుద్ధే, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ ప్రాచీ పాండే, సీబీఎస్ఈ స్కిల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిస్వజిత్ సాహా తదితరులు పాల్గొన్నారు. దేశవిదేశాలకు చెందిన విద్యావేత్తలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యారంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే విధానాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థులను కేవలం పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేలా కాకుండా, జీవితంలో విజయవంతంగా ముందుకు సాగేలా తీర్చిదిద్దేందుకు ఈ సదస్సు దోహదపడిందని పారమిత విద్యాసంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన పాఠశాల ప్రతినిదులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద రావు ప్రత్యేకంగా అభినందించారు.

# అభివృద్ధి కోసం అవసరమైతే అసెంబ్లీలో ధర్నా చేస్తా...

- నిజామాబాద్‌లో బిజేపీ గెలిచిందని ఆర్ వోబీపై నిర్లక్ష్యమా..
- మాధవ్‌నగర్ ధర్నాలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** ఇందూరులో బీజేపీ గెలిచిందని మాధవ్‌నగర్ ఆర్ఓబిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. నగర శివారులోని మాధవనగర్ ఆర్ వోబీ పనుల జాప్యంపై మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తాను ఇక్కడకి ఎమ్మెల్యేగా కాదని, మీలో ఒకడిగా మీ బాధను పంచుకోవడానికి వచ్చానన్నారు. ఈ మాధవ్ నగర్ గేటుతో నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా అన్ని రకాల వాహనాలు సుమారు 4 నుంచి 5 వేల వరకు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. అలాగే ప్రతిరోజు 24 గంటల్లో 58 రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో ప్రతిసారి 15 నుంచి 20 నిమిషాల వరకు గేటు పడటం, భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రధానంగా ఈ సమస్యతో స్కూల్ పిల్లలు స్కూల్ కి లేట్... కూలీలు పనికి లేట్..రోగులు హాస్పిటల్ కి లేట్... ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగానికి లేట్... చివరికి శవాలు కూడా స్మశానానికి లేట్ గా తీసుక వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ ఆర్ వోబీ కొరకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి కేంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. రైల్వే శాఖ తనవంతు పని పూర్తి చేసిందని, మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాధవ్ నగర్ ఆర్ఓబిపై ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డిని గత ఏడాది కలిస్తే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు ఎందుకు పూర్తి కావడం లేదన్నారు. ఇది నిజామాబాద్ అర్బన్ ప్రజలను అవమానించడమేనని విమర్శించారు.

# ప్లీజ్.. వాయిదా వేసుకోండి

### నవంబర్ 1న మెగా ర్యాలీపై రాహుల్‌కు సీటీఐ మరో లేఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండుతో నవంబర్ 1న మెగా ర్యాలీకి పిలుపునిచ్చింది కాంగ్రెస్. అయితే.. పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీ ని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు అభ్యర్థించిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సానుకూలంగా స్పందించకపోవడంతో.. రాహుల్ గాంధీ కి 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' మరోసారి లేఖ రాసింది. పది లక్షల మంది నిరసనకారులు దిల్లీకి వస్తే.. వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండగ సీజన్‌లో ర్యాలీ నిర్వహించడం వల్ల రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని పేర్కొంది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. లేదంటే వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని మార్చాలని లేఖలో కోరింది. ఈ లేఖ ప్రతిని రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కూడా పంపామని.. దీనిపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించాలని కోరామని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ తెలిపారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రోడ్లను మూసివేయడం వంటి చర్యల వల్ల వినియోగదారులు దుకాణాలకు వచ్చే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరుకైన దిల్లీ వీధుల్లోకి లక్షలమంది నిరసనకారులు, 20వేల వాహనాలు రావడం వల్ల వ్యాపారం జరగదన్నారు. అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో సుమారు 4 వేల మంది పాల్గొనడం వల్ల దిల్లీ అంతటా రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిపారు. దీనివల్ల వ్యాపారులకు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించారు

# కరీంనగర్‌ను ఆదర్శనగరంగా తీర్చిదిద్దుతా..

- కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో కలిసిరండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** అభివృద్ధిలో క్లీన్ అండ్ గ్రీన్ లో కరీంనగర్ కార్పొరేషన్ ను తెలంగాణలోనే ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే చిత్తశుద్ధితో క్రుషి చేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్రాల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కరీంనగర్ కలిసి రావాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్ గోపాల్ పూర్ లో రూ.78 లక్షల యూఐడీఎఫ్ నిధులతో డ్రెయిన్, సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ...ఇప్పటికే యూఐడీఎఫ్ కింద 50 కోట్ల రూపాయలు వచ్చినయ్. ఆ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులను స్టార్ట్ చేసినం. ఈ స్కీం కింద మరో 30 కోట్ల రూపాయలు రాబోతున్నయ్. నగరంలో గల్లీగల్లీలో సీసీ రోడ్లను, డ్రెయిన్లను నిర్మిస్తాం. అట్లాగే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివ్రుద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసిందని, శరవేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇవిగాకుండా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయని, కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తామని, కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తామని అభివ్రుద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నామన్నారు. ఈ సందర్భంగా మీ అందరినీ కోరేదొక్కటే ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికల తరువాత అభివ్రుద్ధే ముఖ్యం, నాకు భేషజాల్లేవు, రాజకీయ తారతమ్యాలు లేవు, అందరం కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దామని, అభివ్రుద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు.



### రాత్రివేళ ప్రయాణమంటే ఆందోళన

రహదారిపై సరైన వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని వాహ నదారులు చెబుతున్నారు. పగటిపూట వాహనాల రద్దీ, రాత్రివేళ వెలుతురు కొరతతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని అంటున్నారు. రహదారి విస్తరణ పూర్తయ్యే వరకు గుంతలకు మరమ్మతులు చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని కోరుతున్నారు.

# రాజంపేట రోడ్డుకు మోక్షం ఎప్పుడు?

## ప్రభుత్వాలు మారుతున్నా మారని పరిస్థితి.. నిధులున్నా ముందుకు సాగని పనులు

### ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు.. రాత్రివేళ ప్రయాణమంటేనే భయం

**సంగారెడ్డి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** సంగారెడ్డి పట్టణం అభివృద్ధి చెందుతున్నా, మల్కాపూర్ చింతల్ నుంచి రాజంపేట మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి మాత్రం మారడం లేదు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల కేటాయింపుల ప్రస్తావనలు ఉన్నా పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**వంద అడుగుల రహదారి హామీ ఏమైంది?**

ఈ రహదారిని సుమారు వంద అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో రహదారి కేవలం 18 అడుగులకే పరిమితమైంది. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, పాఠశాల బస్సులతో పాటు భారీ లారీలు, కంటైనర్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు చిన్న వాహనాలు వెళ్లేందుకు స్థలం లేక ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

**నిధులున్నా.. పనుల్లో జాప్యం**

గతంలో రహదారి విస్తరణకు నిధులు కేటాయించినట్లు ప్రచారం జరిగినా పనులు ఎందుకు ప్రారంభం కాలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. భూసేకరణ పూర్తయిందా? అనుమతులు వచ్చాయా? పనులకు అడ్డంకులేమిటి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో సంగారెడ్డి ఎమ్మెల్యేలుగా పనిచేసిన జగ్గారెడ్డి, చింతా ప్రభాకర్ హయాంలోనూ ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి**

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి అనుసంధానించే ఈ మార్గం ద్వారా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డు విస్తరణతో పాటు డ్రైనేజీ, వీధి దీపాలు, పాదచారుల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
రహదారి విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు, నిధులు, అనుమతులు, పనుల ప్రారంభం, పూర్తిచేసే గడువుపై అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా రాజంపేట రహదారి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రకటనలకు పరిమితం కాకుండా పనులు ప్రారంభించి, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. రాజంపేట రోడ్డుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో వేచి చూడాల్సిందే!



**రోడ్డు విస్తీర్ణ పనులు మొదలుపెట్టాలి : స్థానికులు అంజద్ అలీ**

ఎన్నో సంవత్సరాలుగా ఈ రోడ్డు బాగు చేసే నాధుడే లేక.. ప్రభుత్వాలు మారుతున్న రోడ్డు సమస్య మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాపూర్ ఎక్స్ రోడ్ నుండి ఎస్పీ కార్యాలయం వరకు 100 ఫీట్ల రోడ్డు వేయవలసి ఉండగా అనేకసార్లు మున్సిపల్ లో రోడ్డు కోసం చర్చ జరిగిన ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేని వ్యక్తం చేశారు. ఎక్కడికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తీర్ణ పనులు మొదలుపెట్టాలని కోరారు

# ముద్ర రుణం పేరుతో రైతుకు టోకరా

- ప్రాసెసింగ్ ఫీజుల పేరిట డబ్బుల వసూలు
- ఫిర్యాదు ఆధారంగా చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**చేవెళ్ల, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి ముద్ర యోజన కింద రుణం మంజూరు చేస్తామని నమ్మించి చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఓ రైతును గుర్తుతెలియని వ్యక్తులు సైబర్ మోసానికి గురిచేశారు. రుణం పొందాలనే ఆశతో ఉన్న బాధితుడికి నిందితులు ఫోన్ చేసి, ప్రభుత్వ పథకం కింద రుణం మంజూరు చేయిస్తామని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణం మంజూరు కావాలంటే ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర అధికారిక ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని నిందితులు బాధితుడిని నమ్మించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వివిధ దఫాలుగా డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో వివరించారు. అయితే, రుణం మంజూరు చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన గుర్తుతెలియని వ్యక్తుల మోసపూరిత చర్యలపై బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుతో కేసు నమోదు మోసానికి గురైన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు ఆధారంగా చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ పథకాల పేరుతో రుణాలు ఇప్పిస్తామని ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులను నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. రుణం మంజూరు చేస్తామని చెప్పి ముందుగానే ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీల పేరుతో డబ్బులు అడిగితే జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చేవెళ్ల పోలీసులు కోరారు.

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

- వాతావరణానికి అనుగుణంగా పంటల మార్పిడి
- భూగర్భ జలమట్టం 2.27 మీటర్ల లోతుకు పతనం
- రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బోయినపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వరి సాగును తగ్గించి, నువ్వులు, పొద్దుతిరుగుడు, వేరుశనగ, పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం బోయినపల్లి మండలం విలాసాగర్‌లో నిర్వహించిన 'కేత్ బచావో అభియాన్-రైతు నేస్తం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, గత ఏడాదితో పోలిస్తే జలమట్టం 2.27 మీటర్ల లోతుకు పడిపోయిందని కలెక్టర్ తెలిపారు. వరి సాగుకు అధికంగా నీరు, విద్యుత్తు అవసరమవుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించి, జలవనరులను కాపాడుకోవాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను అనుసరించాలని, ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జి గుంతల ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రస్తుతం టన్నుకు రూ.23,641 ధర లభిస్తోందని, సమీపంలోనే సేకరణ కేంద్రం అందుబాటులో ఉందని వివరించారు. రైతులు ఎఫ్‌పీఓలు, సీహెచ్‌సీల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మొహిద్దిన్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఆసుపత్రిలో కాయకల్ప కార్యక్రమం

పెద్దపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి): పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం కాయకల్ప ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బందికి చేతుల పరిశుభ్రత, వైద్య పరికరాల శుభ్రత, క్రిమిసంహారక చర్యలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, మరుగుదొడ్ల పరిశుభ్రతను పాటిస్తూ రోగులకు సురక్షిత వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్, క్వాలిటీ మేనేజర్, ఆర్ఎంఓ పాల్గొన్నారు.

## బియ్యం అక్రమ నిల్వలపై కొరడా

- వ్యాపారులకు పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరిక
- కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** బియ్యం మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి, అక్రమంగా నిల్వలు చేసి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా బియ్యాన్ని న్యాయమైన ధరలకు విక్రయించాలని మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు సూచించారు. జిల్లాలో బియ్యం లభ్యత, నిల్వలు, ధరలపై మంగళవారం మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల బియ్యం నిల్వలు, మార్కెట్లో వాటి లభ్యత, విక్రయ ధరలను సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా బియ్యం సరఫరా జరిగేలా తగిన నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరానికి అనుగుణంగా నిల్వలను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవాలని సూచించారు. వ్యాపార ప్రాంగణాల్లో స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బియ్యం రకం, అందుబాటులో ఉన్న నిల్వల పరిమాణం, కిలో ధరలను బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. బియ్యం నిల్వల కొరత లేదా సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యాపారులకు సూచించారు. ప్రజలు ఆందోళన చెందకుండా, అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల భద్రతే లక్ష్యం.. సైబర్ నేరాలపై అవగాహన

### పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై న్యాయమూర్తుల సూచనలు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి):** విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమకు ఎదురయ్యే అసౌకర్యకరమైన అనుభవాలను వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని న్యాయమూర్తులు సూచించారు. జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో పోక్సో చట్టం, బాలల భద్రత, సైబర్ సెక్యూరిటీపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లాడే రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గోపాల్‌రెడ్డి సైబర్ భద్రత, ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థుల హక్కులు, బాధ్యతలతోపాటు గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై వివరించారు.
బోడుప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి.బాల భాస్కర్‌రావు, సంస్థ కార్యదర్శి జి.ఎస్.ఎల్.ప్రియాంక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని సూచించారు. కాప్రా జెడ్పీహెచ్ఎస్‌లో రెండో అదనపు జిల్లా జడ్జి ఎన్.అమరావతి పోక్సో చట్టం, దాని పరిధిలోని నేరాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసౌకర్యానికి గురిచేసినా, చెడు స్పర్శకు ప్రయత్నించినా వెంటనే ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని చెప్పారు. నేరేడ్‌మెట్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి చిట్టిబొమ్మ ఆశాలత మాట్లాడుతూ ప్రతి చిన్నారికి గౌరవప్రదమైన, పిల్లలకు అనుకూలమైన న్యాయ సహాయం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. పీర్జాదిగూడలోని గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కార్యదర్శి జి.ఎస్.ఎల్.ప్రియాంక పోక్సో కమిటీ సభ్యులతో కలిసి బాలల రక్షణ చర్యలపై చర్చించారు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లోనూ బాలల భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో న్యాయమూర్తులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, కోర్టు సిబ్బంది, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామగుండం ప్రజల సొంతింటి కల సాకారం చేస్తాం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 996 ప్రొసీడింగ్స్ జారీ
- మహిళల పేరిటే ఇళ్ల మంజూరు పత్రాలు : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
- త్వరలో 1,200 మందికి సింగరేణి స్థలాల పట్టాలు
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వాటర్ ప్లాంట్ ప్రారంభం



**గోదావరిఖని, అక్టోబర్ 27 (జనంసాక్షి):** రామగుండం నియోజకవర్గంలోని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. మంగళవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని కాకతీయ కళ్యాణ మండపంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ టవర్స్ ద్వారా సబ్సిడీ రుణాలతో ఫ్లాట్లు కేటాయించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రామగుండంలో ఇప్పటికే 516 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా, తాజాగా 996 మందికి ప్రొసీడింగ్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సుమారు రూ.40 కోట్లతో మౌలిక వసతులు కల్పించి నివాసయోగ్యంగా మార్చామని, గతంలో ఎంపికైన లబ్ధిదారులకే వాటిని కేటాయిస్తున్నామని చెప్పారు. త్వరలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న మరో 1,200 మందికి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మహిళల సాధికారత కోసం వారి పేర్లపైనే ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. రామగుండాన్ని విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్‌లో బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌బాబు వ్యవహరించి పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించారని రాజ్ ఠాకూర్ కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు చివరి తడి వరకు సాగునీరు అందించేందుకు మంత్రి కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే అండగా ఉంటానని అన్నారు. ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లద్నాపూర్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**పుట్టపాకలో వాటర్ ప్లాంట్ ప్రారంభం**

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాకలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన మంత్రికి, సంస్థ ప్రతినిధులకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రూ.4 కోట్ల భూమి బదలాయింపుపై అనుమానాలు!

- ఆరేళ్లు రికార్డుల్లో కనిపించని సర్వే నంబర్.. మళ్లీ ఎలా ప్రత్యక్షమైంది?
- 13 ఎకరాల 17 గుంటల భూమి ఇతరుల పేర్లపైకి బదలాయింపు
- పది రోజుల్లో విచారణ నివేదిక అందిస్తాం: సబ్ కలెక్టర్ సలోని చాప్రా








**ఉప్పునుంతల, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లిలో సుమారు రూ.4 కోట్ల విలువైన భూమి బదలాయింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 115లోని 13 ఎకరాల 17 గుంటల భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో కనిపించకుండా పోవడం, తిరిగి నమోదైన అనంతరం ఇతరుల పేర్లపైకి బదలాయింపు జరిగినట్లు రికార్డుల్లో నమోదవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**2006లో కొనుగోలు.. 2008లో మరోసారి విక్రయం**

అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్ వివరాల ప్రకారం.. అయ్యవారిపల్లికి చెందిన ద్యాప రాంరెడ్డి, పల్లా యాదమ్మల నుంచి 2006లో మహమ్మద్ ఖజామియా, మహమ్మద్ చాంద్ పాషా భూమిని కొనుగోలు చేశారు. అనంతరం 2008లో హైదరాబాద్‌కు చెందిన వర్కల నాగరాజు వారి నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు పత్రాలు సూచిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అనుమతితో లేఅవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం.
అయితే, సర్వే నంబర్ 115లోని 13 ఎకరాల 17 గుంటల భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో కనిపించకపోవడంతో సమస్య మొదలైంది. ఈ విషయంపై నాగరాజు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 2020లో ధరణి రికార్డుల్లో గతంలో భూమిని విక్రయించిన రైతుల పేర్లు మళ్లీ కనిపించాయని, తన వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలతో అధికారులను సంప్రదించగా భూమిని పార్ట్-బీ జాబితాలో చేర్చినట్లు చెప్పారని పేర్కొన్నారు.

**ఇతరుల పేర్లపైకి బదలాయింపు**

2026 ఆగస్టు 19న 11 మంది పేర్లపై భూమి బదలాయింపు జరిగినట్లు రికార్డుల్లో నమోదైనట్లు సమాచారం. సెప్టెంబర్ 26న కట్ట స్వప్న, ఉల్వల వనజ పేర్లపై మరోసారి రిజిస్ట్రేషన్ జరిగినట్లు పత్రాలు సూచిస్తున్నాయి. గతంలో రికార్డుల్లో కనిపించని భూమి తిరిగి ఎలా నమోదైంది? యాజమాన్య హక్కుల మార్పునకు ఏ పత్రాలను ఆధారంగా తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.
ఈ వ్యవహారంలో ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రెవెన్యూ అధికారుల పాత్రపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నయీం అనుచరుల పేరును ఉపయోగించి రైతులను బెదిరించి భూములు స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో, ప్రస్తుత వ్యవహారంలోనూ నయీం పేరు ప్రస్తావనకు వస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.

**ప్లాట్ల కొనుగోలుదారుల్లో ఆందోళన**

సర్వే నంబర్ 115లో సుమారు 50 ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం. వీటిలో 37 మంది లబ్ధిదారులు లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం కింద ప్రభుత్వానికి రుసుములు చెల్లించినట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. యాజమాన్య హక్కులపై వివాదంతో తమ ప్లాట్ల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**న్యాయం చేయాలి : వర్కల నాగరాజు**



తాను 2008 జూలై 11న మహమ్మద్ చాంద్ పాషా నుంచి దస్తావేజు నంబర్ 2023/ 2008 ద్వారా, మహమ్మద్ ఖజామియా నుంచి దస్తావేజు నంబర్ 2121/2008 ద్వారా భూమిని కొనుగోలు చేశాను. రికార్డుల ప్రక్షాళన సమయంలో సర్వే నంబర్ 115లో కొంత భూమి మాత్రమే నమోదైంది. మిగిలిన 13 ఎకరాల 17 గుంటలు కనిపించకుండా పోయాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

**పది రోజుల్లో నివేదిక అందిస్తాం: అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాప్రా**



అయ్యవారిపల్లి సర్వే నంబర్ 115లోని 13 ఎకరాల 17 గుంటల భూమి వ్యవహారం తన దృష్టికి వచ్చింది. భూమికి సంబంధించిన రికార్డులు, రిజిస్ట్రేషన్లు, యాజమాన్య హక్కుల మార్పులు, బదలాయింపు పత్రాలను సమగ్రంగా పరిశీలించి విచారణ చేపడతాం. పది రోజుల్లో విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం.



## అయిజ మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

- విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆరోపణలు.
- పట్టణ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

**అయిజ అక్టోబర్ 27 (జనంసాక్షి) :** అయిజ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కమిషనర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, వైస్ చైర్మన్ మాల నరసింహులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కమిషనర్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విధులకు వచ్చి గురువారం వెళ్లిపోతున్నారని, దీంతో మున్సిపాలిటీలో పరిపాలనా వ్యవహారాలు సక్రమంగా సాగడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బందిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. చైర్మన్, కౌన్సిలర్లు పట్టణ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

**కమిషనర్ గైర్హాజరుతో సాధారణ సమావేశం వాయిదా.**

పట్టణంలో నెలకొన్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు నిర్వహించాల్సిన మున్సిపల్ సాధారణ సమావేశానికి కమిషనర్ హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా పడినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కీలకమైన సాధారణ సమావేశం నిర్వహించలేకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.

### 3వ ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నీకి

## తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యం

- 8 క్రికెట్ మైదానాల ఎంపిక
- ఏర్పాట్లపై డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష



**హైదరాబాద్, అక్టోబరు 27 (జనంసాక్షి) :** తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడో ఆల్ ఇండియా పోలీస్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ 2026-27 (పురుషులు) డిసెంబరు 10 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, పోలీసు విభాగాలకు చెందిన సుమారు 35 జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం డిజిపి సివి ఆనంద్ డిజిపి కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి పోలీసు క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమని డిజిపి పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో ప్రతి మ్యాచ్ 20 ఓవర్ల పాటు సాగనుంది.

#### ఎనిమిది మైదానాల ఎంపిక

టోర్నమెంట్ నిర్వహణ కోసం ఆరు ప్రధాన క్రికెట్ మైదానాలతో పాటు మరో రెండు రిజర్వు మైదానాలను ఎంపిక చేశారు. మొయినాబాద్‌లోని ఆసీస్‌నగర్ లో క్రికెట్ మైదానాలను ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు డిజిపి కి వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పోలీసు క్రీడాకారుల వసతి కోసం తెలంగాణ పోలీసు అకాడమీలో ఏర్పాట్లు చేయనున్నారు. క్రీడాకారుల రవాణా, భోజన వసతి, మైదానాల నిర్వహణ, భద్రత, మ్యాచ్‌ల సమన్వయం తదితర అంశాలపై డీజీపీ అధికారులతో చర్చించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

#### పలు కమిటీలకు బాధ్యతలు

టోర్నమెంట్ నిర్వహణ కోసం అడ్మినిస్ట్రేషన్, రవాణా, మీడియా ప్రచారం, భద్రత, సాంకేతిక, మ్యాచ్‌ల సమన్వయం, ఆర్థిక వ్యవహారాల కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. జాతీయస్థాయి పోటీలకు హైదరాబాద్ వేదిక కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నైనీ బొగ్గు రవాణా మార్గాల నిర్మాణానికి సహకరించండి

- అంగూల్ జిల్లా కలెక్టర్‌ను కోరిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- 40 మంది ప్రాజెక్టు ప్రభావిత నిర్వాసితుల కోసం ఆర్ అండ్ ఆర్ కేంద్రానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి
- ఒడిశాలో సింగరేణి కార్యాలయం, ఉద్యోగుల కాలనీ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ప్రతిపాదన
- సింగరేణికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో తమ నైనీ బొగ్గు గని సమీపంలో నిర్మించ తలపెట్టిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం, నైనీ నిర్వాసితులకు ఉద్దేశించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ, బొగ్గు రవాణాకు అవసరమైన రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల కేటాయింపు వంటి అంశాలపై అంగూల్ జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దాల్ అక్తార్‌తో సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మంగళవారం ప్రత్యేకించి సమావేశం అయ్యారు. అంశాల వారీగా చర్చించి తగిన సహకారం అందించాల్సిందిగా కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఛైర్మన్ తో పాటు సింగరేణి డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్. వి సూర్యనారాయణ, ఈడీ(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ, అనుమతులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. నైనీ బొగ్గు గని వల్ల నిర్వాసితులైన 40 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను సింగరేణి ఛైర్మన్ కోరారు. అలాగే త్వరలోనే రిహాబిలిటేషన్ అండ్ పెరిఫెరి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, కాలనీ నిర్మాణానికి భూసేకరణ, పునరావాసం ప్యాకేజీలు మొదలైన సమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ నైనీ బొగ్గు గనికి అనుబంధంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, దీనికి సంబంధించి తుకుడా మరియు జరపడా గ్రామాలకు చెందిన స్థలం అనుకూలమైనదిగా గుర్తించామని, ఈ స్థల సేకరణకు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం నైనీ బ్లాక్ నుండి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును సమీపంలో గల జరపడా రైల్వే జంక్షన్ కు రవాణా చేయడం కోసం చండీపడా-జరపడా గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం సింగరేణి సంస్థ తనవంతుగా ఇప్పటికే 35 కోట్ల రూపాయలు డిపాజిట్ చేసిందని, ఈ రోడ్డు కోల్ కారిడార్ మాదిరిగా మారి ఇతర బొగ్గు ఉత్పత్తి పరిశ్రమలకు కూడా ఉపయోగపడుతుంది, కాబట్టి సంబంధిత శాఖల సహకారంతో నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. సింగరేణి సంస్థ ఒడిశాలో తన కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో సింగరేణి కార్యాలయ నిర్మాణానికి మరియు ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణానికి తగిన స్థలాన్ని గుర్తించి తమకు కేటాయించాలని కూడా కోరారు. స్థానిక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు రవాణా జరపడం కోసం మారికా బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని, ఇప్పటికే సింగరేణి సంస్థ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థకు తాము అన్ని రకాలుగా సహకరిస్తామని, దేశ విద్యుత్ అవసరాల కోసం కృషి చేస్తున్న సింగరేణికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

#### ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్ సందర్శన

అంగూల్ జిల్లాలో జిందాల్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్. వి సూర్యనారాయణ, ఈడీ(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ సందర్శించారు. ఈ ప్లాంట్‌లో దేశీయ బొగ్గు తో గ్యాస్ ఉత్పత్తి చేస్తూ దాన్ని జిందాల్ స్టీల్ కోసం వినియోగిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. సింగరేణిలో మూతపడిన భూ గర్భ గనుల నుంచి కోల్ గ్యాసిఫికేషన్ కు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు తదితర అంశాలపై నిపుణులతో చర్చించారు. ఈ జిందాల్ ప్లాంట్ కు సింగరేణి నైనీ గని నుంచి కూడా కొంత బొగ్గు రవాణా అవుతోండటం విశేషం. ఈ సమావేశంలో ఇంకా నైనీ గని జనరల్ మేనేజర్ బైద్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కండక్టర్ ప్రవళికకు మంత్రి పొన్నం పరామర్శ

- రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



**హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఇటీవల ప్రయాణికుడు తోసివేయడంతో గాయపడిన ఖమ్మం రీజియన్ మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రవళిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖమ్మం ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ సిబ్బంది పట్ల ప్రయాణికులు గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. సిబ్బంది ప్రవర్తనపై ప్రయాణికులకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆర్టీసీ యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రజలకు సేవ చేయడం ఉద్యోగుల బాధ్యత అయినప్పటికీ, వారి ప్రాణాల రక్షణ, భద్రత కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.

## నేడు ఓయూలో 'నషా ముక్త్ భారత్'పై సదస్సు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో చైతన్యం తెచ్చేందుకు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు లోక్ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నర్ నషా ముక్త్ భారత్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించి ప్రసంగిస్తారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. రక్తదాతలకు పండ్లు, ధ్రువపత్రాలు అందజేసిన తర్వాత.. 1,200 మందికి పైగా ఓయూ విద్యార్థులు, ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు, ఐఆర్‌సీఎస్ సభ్యులతో ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు సాగే భారీ ర్యాలీని గవర్నర్ జెండా ఊపి ప్రారంభిస్తారు. ఇందులో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర శాఖ ఛైర్మన్ ఎం.దానకిశోర్ పాల్గొంటారు.

## మూడు బ్యారేజీలతో ఒక్క ఎకరాకూ నీరు రాలేదు

### మంత్రి శ్రీధర్ బాబు

- ప్రజలకు మేలు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- నవంబర్ 1న మంథనికి గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామి రాక
- హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



**మంథని, అక్టోబర్, 27 (జనంసాక్షి ) :** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుల నిర్మాణం, బ్యారేజీల రూపకల్పన, గత ప్రభుత్వ వైఖరిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. గతంలో సాంకేతిక కారణాలు, నది పరివాహక ప్రాంత పరిస్థితులు, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో మూడు బ్యారేజీల నిర్మాణం చేపట్టారని వివరించారు. ఈ బ్యారేజీల నిర్మాణం కారణంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు భూములు, ఇళ్లు, జీవనోపాధి మార్గాలను కోల్పోయినప్పటికీ, వాటి ద్వారా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదని మంత్రి విమర్శించారు. ఈ పరిస్థితికి ఇక్కడి ప్రజలే సాక్షులని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల కార్యాచరణను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సాగునీటి ప్రయోజనాల సాధనకు కట్టుబడి ఉన్నామని మంత్రి తెలిపారు. మంథని పట్టణంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల వికాస ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, సాంకేతిక విజ్ఞానం పొందుతూ ఉన్నత శిఖరాలు చేరాలని సూచించారు. అనంతరం బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామి వారు నవంబర్ 1 తేదీన మంథని పట్టణానికి విచ్చేయనున్న నేపథ్యంలో పట్టణంలోని అయ్యగారి చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌తో పాటు ఇతర ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. స్వామివారి రాక సందర్భంగా భక్తులందరికీ దివ్యాశీస్సులు అందేలా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురు ప్రముఖులను, మంథని పట్టణానికి చెందిన పెద్దలను స్వయంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. నవంబర్ 1న మధ్యాహ్నం స్వామివారు దత్తాత్రేయ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మంథని ప్రాంత భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు అందించడంతో పాటు, భక్తులకు దివ్యాశీస్సులు అందించేందుకు శివకిరణ్ గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.



## పంట పొలాల్లో గంజాయి సాగు

- 55 గంజాయి మొక్కలు, 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

**సదాశివపేట, అక్టోబర్ 27 (జనంసాక్షి):** సదాశివపేట మండల పరిధిలోని కోనాపూర్, అంకెన్‌పల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలు, ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కోనాపూర్ శివారులోని సర్వే నంబర్ 206లో అక్రమంగా సాగు చేస్తున్న 55 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, నిందితుడు ఎండీ ఖదీర్ (55)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అంకెన్‌పల్లిలో గౌండ్ల విట్టల్‌గౌడ్ ఇంటిపై దాడి చేసి 10 గంజాయి మొక్కలతో పాటు 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పట్టా భూముల్లో నిషేధిత గంజాయి సాగు చేస్తే రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు. గంజాయి సాగు, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు.

## మస్కట్‌లో ఆర్మూర్ వాసి అదృశ్యం

- ఆచూకీ కనుగొనాలని సీఎం ప్రజావాణిలో విజ్ఞప్తి
- జీఏడీ. ద్వారా ఓమన్ దేశ ఎంబసీకి లేఖ
- బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఓమన్ దేశం మస్కట్ సిటీలో రెండు నెలల కిందట అదృశ్యమైన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన చెందిన ఆకుల రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆచూకీ కనుగొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం సీఎం ప్రజావాణికి వచ్చిన విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించారు. ఈ విషయంపై జీఏడీ ద్వారా ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ పంపించి, అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు, మిస్సింగ్ అయిన వ్యక్తి భార్య స్వాతికి ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని గద్వాల్ విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. ఆర్మూర్ కు చెందిన ఉజ్వల ట్రస్ట్ ఛైర్మన్ మీనీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం నాయకులు తేలు పెద్ద ఒడ్డెన్న, నడ్పి ఒడ్డెన్న సీఎం ప్రజావాణికి వచ్చారు. ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీం రెడ్డి కూడా పాల్గొన్నారు.



#### సీఎం ప్రజావాణిలో 140 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 264వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 140 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ శాఖకు 29, మున్సిపల్ శాఖకు 20, హోం శాఖకు 17, ఇతర శాఖలకు 74 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370